


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 302 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు శనివారం 4 జూలై 2026 వెల : 1/-రూ ॥


VOLUME :1 ISSUE :302 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SAT 4 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# సందిగ్ధంలో అన్నదాతలు

## రెగ్యులర్ పంటలా - ఆరుతడి పంటలా?

- ఎటూ తేల్చుకోలేని స్థితిలో అన్నదాత
- ఖరీఫ్ సీజన్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్న ఎల్‌నినో
- వర్షాలు కురవకపోవడంతో వరి సాగుకు ఇబ్బందులు
- జిల్లాల్లో తగ్గిన వరి సాగు - వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతన్నలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గుము ఖం పట్టడంతో జలాశయాలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటు న్నాయి. ఏ పంటలు సాగుచేయాలో తెలియక రైతులు సతమతం అవుతున్నా రు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ప్రభుత్వం సూచి స్తున్నా అన్నదాతలు మొగ్గు చూపడంలేదు. వరి పండే నేలల్లో ఇతర పంటలు సాగయ్యే అవకాశం లేదని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఆరుతడి పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు కోరుతున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో జిల్లాల్లో

- మిగతా 2లో



## తీరందాటిన నైరుతి రుతుపవనాలు

- దక్షిణాది రాష్ట్రాల్లో భారీగా వర్షాలు, వరదలు
- మత్స్యకారులకు ఐఎండీ హైఅలర్ట్?!
- నైరుతి రుతుపవనాలతో దేశవ్యాప్తంగా వర్షాలు
- పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదలు రావచ్చని ఐఎండీ హెచ్చరిక

- మిగతా 2లో

## విజయవాడలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో

# పవన్ కల్యాణ్ భేటీ

- వివిధ అంశాలపై గవర్నర్ తో ఫలప్రదమైన చర్చ జరిగిందని వెల్లడించిన పవన్
- అంతకుముందు సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణతో సమావేశం
- గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై 'ఈగల్' విభాగం నివేదిక సమర్పణ
- సోషల్ మీడియా వేధింపులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఐజీ వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుక్రవారం నాడు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సాయంత్రం పవన్ విజయవాడలోని లోక్ భవన్ కు వెళ్లారు. ఈ భేటీ చాలా ఆత్మీయంగా, ఫలప్రదంగా జరిగిందని పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా తెలిపారు. పలు అంశాలపై ఇరువురూ చర్చించుకున్నారని, గవర్నర్ మార్గదర్శకత్వం, ఆతిథ్యం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. అంతకుముందు, పవన్ కల్యాణ్ మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో 'ఈగల్' విభాగం

- మిగతా 2లో



## వారసత్వ సంపద మీ సొత్తు కాదు

- పాకిస్థాన్‌పై భారత్ ఘాటు వ్యాఖ్యలు
- తక్షశిలలో పాకిస్థాన్ చేపట్టిన పునర్నిర్మాణ పనులపై తీవ్ర వివాదం
- నిబంధనలకు విరుద్ధంగా పనులు ఆపకపోతే ప్రమాద జాబితాలో చేర్చుతామని యునెస్కో హెచ్చరిక
- వారసత్వ సంపద ప్రపంచానిదని, ఏ ఒక్క దేశానిది కాదని స్పష్టం చేసిన భారత్
- తక్షశిలను ప్రపంచ వారసత్వ జాబితా నుంచి తొలగిస్తామని కూడా హెచ్చరించిన యునెస్కో


- మిగతా 2లో



## ఉగ్రవాద నిర్మూలనకు ప్రపంచ దేశాలు సహకరించాలి

- ఉగ్రవాదానికి మద్దతు ఆపితేనే సింధు జలాల ఒప్పందం పునరుద్ధరణ: భారత్
- సింధు జలాల ఒప్పందంపై భారత్ కీలక వ్యాఖ్యలు
- ఉగ్రవాదానికి పాకిస్థాన్ మద్దతు పూర్తిగా, శాశ్వతంగా వీడే వరకు ఒప్పందం ఉండదని స్పష్టం
- అఫ్గానిస్థాన్‌పై పాక్ వైమానిక దాడుల్ని కూడా ఖండించిన ప్రభుత్వం

- మిగతా 2లో



## పాకిస్థాన్‌లో ఘోర బస్సు ప్రమాదం

- పాకిస్థాన్‌లో లోయలో పడిపోయిన ప్రయాణికుల బస్సు
- ప్రమాదంలో కనీసం 40 మంది మృతి, 8 మందికి గాయాలు
- బ్రేకులు ఫెయిల్ కావడం, అధిక ప్రయాణికులే కారణం!

2లో

# గూగుల్ కంటే ఇవే ఎక్కువ సంతోషం కలిగించాయి

- గూగుల్ కంటే కుప్పం ప్రాజెక్టులే ఎక్కువ సంతోషాన్నిచ్చాయని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- కుప్పంలో రూ.9,322 కోట్ల విలువైన 27 పరిశ్రమలకు వర్చువల్‌గా శంకుస్థాపన
- అడిడాస్ షూస్, విమానాల తయారీ వంటి కీలక కంపెనీలతో వేల ఉద్యోగాలకు అవకాశం
- శంకుస్థాపన రోజే ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను ప్రకటించిన పారిశ్రామికవేత్తలు
- దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పాన్ని తీర్చిదిద్దుతానని ముఖ్యమంత్రి హామీ






**పెన్ పవర్ డెస్క్:** "గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన చేసిన నాటి కంటే, ఇవాళ జరిగిన కార్యక్ర మాలతోనే నాకు ఎక్కువ సంతోషంగా ఉంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తన సొంత నియోజకవర్గమైన కుప్పం రూపురేఖలను మార్చే భారీ పారిశ్రామిక ప్రగతికి శ్రీకారం చుట్టిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం గుడుపల్లె మండలం పొగురుపల్లిలో "స్వర్ణ కుప్పం.. పెట్టుబడుల వేదిక" పేరుతో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ వేదికపై నుంచి వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో, వేలాది మందికి ఉద్యోగా లు కల్పించే పలు కీలక ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

- మిగతా 2లో

## జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో సీమ దశ మారిపోతుంది

- సున్నపురాళ్లపల్లి వద్ద జేఎస్‌డబ్ల్యూ గ్రీన్ స్టీల్ ప్లాంట్ పనులకు చంద్రబాబు శ్రీకారం
- ప్రకటన విడుదల చేసిన నారా లోకేశ్
- సీమ దశాబ్దాల కలను నిజం చేస్తూ చారిత్రాత్మక అడుగు వేశామని వ్యాఖ్య
- ఈ ప్రాజెక్టుతో స్థానిక యువతకు వేలాది ఉద్యోగాలు లభిస్తాయని ధీమా
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏపీని ప్రగతి పథంలో నిలుపుతామన్న లోకేశ్



**పెన్ పవర్ డెస్క్:** రాయలసీమ ప్రజల దశాబ్దాల కల అయిన కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణంలో మరో చారిత్రాత్మక అడుగు పడిందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేశామని ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమ రూపురేఖలు మారనున్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో విజయనగరంలో జేఎస్‌డబ్ల్యూ పారిశ్రామిక పార్కు పనులను కూడా ప్రారంభించినట్లు పేర్కొన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లి వద్ద

- మిగతా 2లో



# మోదీ 3 దేశాల టూర్ ఖరారు

- 40ఏళ్లలో తొలిసారి న్యూజిలాండ్‌లో పర్యటన
- జులై 6 నుంచి 11 వరకు ప్రధాని మోదీ విదేశీ పర్యటన
- ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో పర్యటించనున్న పీఎం
- దాదాపు 40 సంవత్సరాల తర్వాత ఒక భారత ప్రధాన మంత్రి న్యూజిలాండ్‌లలో పర్యటించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# ‘సవాళ్ల’ రాజకీయంలో ప్రజలే సమిధలు!

తెలంగాణలో అధికార పార్టీ కాంగ్రెస్ వర్సెస్ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ మధ్య గురువారం రోజు రోజంతా సవాళ్ల రాజకీయం సాగింది. నువ్వా-నేనా అన్నట్టుగా ఉదయం 8 గంటల నుంచే ఈ హడావుడి .. రాజకీయ విమర్శలు సంచలనం సృష్టించాయి. ఇలా.. ఉదయం నుంచి దాదాపు సాయంత్రం 6 గంటల వరకు సాగిన ఈ రాజకీయ కొట్లాటలో ఇరు పక్షాలు సాధించింది ఏమైనా ఉందా? అనే ప్రశ్న తప్ప మరొకటి లేదు. కానీ, ఈ రాజకీయ యాగీ కారణంగా సాధారణ ప్రజలకు చుక్కలు కనిపించాయి. బంజారాహిల్స్ నుంచి గన్ పార్క్ వరకు.. అసెంబ్లీ నుంచి కంచన్‌బాగ్ దాకా కూడా.. పోలీసులు నిర్బంధాలు విధించారు. ఈ రహదారులపై నిషేధాజ్ఞలు కొనసాగాయి. సాధారణ వాహనాలు, పౌరులను ఈ దారుల్లో నియంత్రించారు. ఫలితంగా విధులకు వెళ్లాల్సిన ఉద్యోగులు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, కళాశాలలకు వెళ్లాల్సిన వారు కూడా తీవ్ర నరకం చవిచూశారు. ప్రత్యామ్నాయ మార్గాలను సూచించేందుకు కూడా సమయం లేకపోవడం, రాజకీయంగా ఒక్కసారిగా ఉద్రిక్తతలు పెరగడంతో పోలీసులు కూడా చేతులు ఎత్తేసిన పరిస్థితి కనిపించింది. ముఖ్యంగా అధికార పక్షం నుంచి మంత్రులే రోడ్డెక్కడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. మరోవైపు బొల్లారం, బోడుప్పల్‌లో టీఆర్ ఎస్ అధ్యక్షురాలు కవిత ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన నిరసన కూడా దీనికి కలిసి వచ్చింది. ఇలా.. మొత్తంగా గురువారం హైదరాబాద్ నగరంలో ప్రజలు అగచాట్లు పడ్డారు.

**భారీ అసహనం..**

ఇటు ప్రభుత్వం, అటు ప్రధాన ప్రతిపక్షం వైఖరిపై సాధారణ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేయడం గమనార్హం. ఎవరికోసం ఈ సవాళ్లు అంటూ.. సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా అప్పులపై సవాళ్లు రువ్వుకోవడాన్ని చాలా మంది ఎద్దేవా చేశారు. అధికారంలో ఎవరు ఉన్నా.. అప్పులు చేస్తున్నారని.. తర్వాత దీనిని రాజకీయం చేస్తున్నారని ఓయూ విద్యార్థి సంఘం నాయకులు విమర్శించారు. ఏతా వాతా ఎలా చూసుకున్నా.. సవాళ్ల రాజకీయంలో సాధారణ ప్రజలే సమిధలుగా మారారని అంటున్నారు.

## వారసత్వ సంపద మీ సొత్తు కాదు..

ప్రపంచ వారసత్వ ప్రదేశమైన తక్షశిలలోని రెండు చారిత్రక కట్టడాల వద్ద పాకిస్థాన్ చేపట్టిన పునర్నిర్మాణ పనులపై తీవ్ర దుమారం రేగింది. ఈ వ్యవహారంపై ఐక్యరాజ్యసమితి సాంస్కృతిక విభాగం (యునెస్కో) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా, భారత్ కూడా ఘాటుగా స్పందించింది. ఈ అంశంపై న్యూఢిల్లీలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. వారసత్వ సంపద, ముఖ్యంగా యునెస్కో గుర్తించిన ప్రదేశాలు ఏ ఒక్క వ్యక్తికి లేదా దేశానికి చెందినవి కావని స్పష్టం చేశారు. “అవి మొత్తం ప్రపంచానికి చెందినవి. మన వారసత్వాన్ని కాపాడుకోవడం, పరిరక్షిం చడం అందరి సమిష్టి బాధ్యత” అని ఆయన అన్నారు. పురావస్తు కట్టడాల పరిరక్షణ నియమాలను పాకిస్థాన్ ఉల్లంఘిస్తోందన్న నివేదికలపై ఆయన ఈ విధంగా స్పందించారు. పాకిస్థాన్‌లోని ప్రముఖ పత్రిక ‘డాన్’ కథనం ప్రకారం, తక్షశిలలోని కట్టడాల సమగ్రతను దెబ్బతీసేలా ఉన్న పునర్నిర్మాణ పనులను వెంటనే వెనక్కి తీసుకోవాలని యునెస్కో పాక్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. లేనిపక్షంలో ఆ ప్రదేశాలను ‘ప్రమాదకర జాబితా’లో చేర్చుతామని హెచ్చరించింది. అంతేకాకుండా, అనవసరమైన జోక్యం కారణంగా తక్షశిలను ప్రపంచ వారసత్వ జాబితా నుంచి తొలగించడానికి కూడా వెనుకాడబోమని యునెస్కో స్పష్టం చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. తక్షశిలలోని మొహ్రా మొరాదు, సిర్కాప్‌లో పంజాబ్ పురావస్తు శాఖ చేపట్టిన పనులపై సమాచారం, చిత్రాలను మూడో పక్షం పారిస్‌లోని పాక్ శాశ్వత ప్రతినిధికి పంపడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై జూన్ 12న యునెస్కో, పాక్ పురావస్తు శాఖ అధికారులు సంయుక్తంగా తక్షశిలను సందర్శించారు. నిర్మాణాలకు ముందు, తర్వాత తీసిన ఫొటోలు, వినియోగించిన మెటీరియల్‌పై ల్యాబ్ రిపోర్టులు సమర్పించాలని యునెస్కో కోరింది. ప్రపంచ వారసత్వ కట్టడాల పునరుద్ధరణలో సిమెంట్ వాడటం యునెస్కో నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించడమేనని నిపుణులు చెబుతున్నారు. ఈ వివాదం కారణంగా ప్రపంచ వారసత్వ జాబితాలో మరో 24 ప్రదేశాలను చేర్చాలన్న పాకిస్థాన్ ప్రయత్నాలకు ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంది.

## పాకిస్థాన్‌లో ఘోర బస్సు ప్రమాదం

పాకిస్థాన్‌లో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ప్రయాణికులతో వెళుతున్న బస్సు అదుపుతప్పి లోతైన లోయలో పడిపోవడంతో కనీసం 40 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సుల సరిహద్దులోని షెరనీ జిల్లాలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతున్న ఈ ప్రయాణికుల బస్సు, దానా సర్ ప్రాంతంలోని పర్వత రహదారిపై ప్రయాణిస్తుండగా ఉదయం 8 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. బస్సులో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించడం, బ్రేకులు విఫలం కావడం వల్లే ఈ ఘోరం జరిగిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాదకరమైన మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు ఒక్కసారిగా లోయలోకి దూసుకెళ్లింది. ప్రారంభంలో ఈ బస్సు 36 మంది ప్రయాణికులతో బయలుదేరినప్పటికీ, మార్గమధ్యంలో మొరాయించిన మరో వాహనంలోని ప్రయాణికులను కూడా ఎక్కించుకోవడంతో మొత్తం ప్రయాణికుల సంఖ్య 48కి చేరింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే ‘1122’ అత్యవసర సిబ్బంది, స్థానిక అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని జోబ్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘోర ప్రమాదంపై బలూచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగ్తీ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించగా, పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# గూగుల్ కంటే ఇవే ఎక్కువ సంతోషం కలిగించాయి

**పెట్టుబడుల కుంభవృష్టి.. ఉద్యోగాల జాతర**

ఒకప్పుడు మారుమూల ప్రాంతంగా ఉన్న కుప్పం, ఇప్పుడు అభివృద్ధి కేంద్రంగా మారుతోందని చంద్రబాబు అన్నారు. మొత్తం రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 27 పరిశ్రమలు కుప్పంలో కొలువుదీర నున్నాయని ప్రకటించారు. ఫుట్‌వేర్ నుంచి విమానాల తయారీ వరకు వివిధ రంగాలకు చెందిన ప్రఖ్యాత కంపెనీలు తమ యూనిట్లను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్ అడిడాస్ ఫుట్‌వేర్ తయారీ యూనిట్‌కు సీఎం భూమిపూజ చేశారు. హ్వాసెంగ్ గ్రూప్ ఆధ్వర్యంలో రూ.899 కోట్ల పెట్టుబడితో ఏర్పాట వుతున్న ఈ పరిశ్రమ ద్వారా ఏకంగా 20,145 మందికి ఉపాధి లభించనుంది.

దేశంలోనే తొలి బ్యాటరీ అనోడ్ మెటీరియల్ ప్లాంట్‌కు కుప్పంలో శ్రీకారం చుట్టారు. అథా గ్రూప్ రూ.2,081 కోట్ల భారీ పెట్టుబడితో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తుండగా, దీని ద్వారా 2,600 మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఏ

వియేషన్ రంగంలోనూ కుప్పం తనదైన ముద్ర వేయనుంది. పయనీర్ క్లీన్ యాంప్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.150 కోట్ల పెట్టుబడితో టూ సీటర్ ట్రైనర్ విమానాల తయారీ యూనిట్‌ను నెలకొల్పనుంది. దీనివల్ల 1,400 మందికి ఉపాధి దొరుకుతుంది. వీటితో పాటు ఎంఎఫ్ క్లోతింగ్ (గార్మెంట్స్), న్యూట్రి ఫీడ్స్ (చికెన్ ప్రాసెసింగ్), ఫామ్ అమినో అగ్రిటెక్ (కర్కుమిన్ ఎక్స్‌ట్రాక్షన్) వంటి అనేక ఇతర పరిశ్రమల నిర్మాణాలకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

**శంకుస్థాపన రోజే ప్రారంభ తేదీలు**

ఈ సందర్భంగా పరిశ్రమలకు ఏపీ ప్రభుత్వం అందిస్తున్న సహకారం అద్భుతంగా ఉందని పారిశ్రామికవేత్తలు ప్రశంసించారు. ప్రభుత్వ ప్రోత్సాహం చూశాక, పనులను మరింత వేగంగా పూర్తి చేయాలనే ఉత్సాహం కలుగుతోందని తెలిపారు. శంకుస్థాపన రోజే ప్రారంభోత్సవ తేదీలను నిర్దేశించుకుని పనిచేయాలని పారిశ్రామికవేత్తలకు సీఎం సూచించగా, వారు వేదికపై నుంచే తమ ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను ప్రకటించడం విశేషం. అనంతరం ఆయా కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి నిర్వహించిన సీఎం, వారి ఉత్పత్తులు, పనితీరు గురించి ఆరా తీశారు.

**కుప్పం నా బాధ్యత.. అభివృద్ధి నా ఆశయం**

ఈ సభలో ప్రసంగించిన చంద్రబాబు, కుప్పం ప్రజలు తనను 8వ సారి ఎమ్మెల్యేగా గెలిపించారని, వారి దీవెనలే తనకు శ్రీరామరక్ష అని అన్నారు. “నేను ఎక్కడున్నా నా ఆలోచనలు కుప్పం మీదే ఉంటాయి. దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పాన్ని తయారు చేయాలన్నది నా కోరిక. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలి, అందులో కుప్పం ముందుండాలి,” అని ఆయన ఆకాంక్షించారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన యువతను అందించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. అభివృద్ధిని అడ్డుకునే వారి తోకలు కత్తిరిస్తానని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలతో పాటు, ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం, బీసీ, ఓసీ కుటుంబాలకు రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టు, పరిశ్రమల కోసం విద్యుత్ సబ్‌స్టేషన్లు, హెరిటేజ్ గ్రానైట్ స్టోన్ క్లస్టర్ వంటి పలు అభివృద్ధి పనులకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, చిత్తూరు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో సీమ దశ మారిపోతుంది

- మొదటి పేజి తరువాయి

2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో జేఎస్‌డబ్ల్యూ గ్రీన్ స్టీల్ ప్లాంట్, 350 మెగావాట్ల సామర్థ్యంతో జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ ప్లాంట్ పనులకు ఇవాళ సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టడం తెలిసిందే. దీనిపై లోకేశ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రాయలసీమ ప్రాంతం ఒక ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు.

ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నిలపాలన్న కూటమి ప్రజా ప్రభుత్వ ఉక్కు సంకల్పానికి ఈ స్టీల్

ప్లాంట్ నిదర్శనమని లోకేశ్ అభివర్ణించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ‘స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్’తో రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతి పథంలో నిలుపుతామని ఆయన స్పష్టం చేశారు.

# మోదీ 3 దేశాల టూర్ ఖరారు

ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 6 నుంచి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో పర్యటించను న్నారు. ఈ 3 దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా మోదీ ఈ పర్యటన చేయనున్నా రని విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) శుక్రవారం వెల్లడిం చింది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ మొదట ఇండోనేషియాను సందర్శిస్తారు. ఆ తర్వాత ఆస్ట్రేలియాకు ప్రయాణమవుతారు. అక్కడ ఆయన ప్రధాన అధికారిక కార్యక్రమాలు మెల్‌బోర్న్‌లో జరుగుతాయి. అనంతరం న్యూజిలాండ్‌కు వెళ్లి తన పర్యటనను ముగిస్తారని ఎంఈఏ కార్యదర్శి (ఈస్ట్) రుద్రేంద్ర టాండన్ తెలిపారు.

**40 ఏళ్లలో మొదటిసారి**

ప్రధాని మోదీ న్యూజిలాండ్ పర్యటన ఎంతో ప్రత్యేకమైనది. దాదాపు 40 సంవత్సరాల తర్వాత ఒక భారత ప్రధాన మంత్రి ఆ దేశంలో పర్యటించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. వచ్చేవారం ప్రధాని మోదీ న్యూజిలాండ్‌లో తన మొదటి అధికారిక పర్యటన చేయనున్నట్లు ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ ఈ రోజు ఉదయం అధికారికంగా ప్రకటించారు. “భారత ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే వారం న్యూజిలాండ్‌లో తన మొదటి అధికారిక పర్యటన చేయనున్నారని ప్రకటించడానికి నేను ఎంతో సంతోషిస్తున్నాను” అని లక్సన్ తన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అయితే ఈ పర్యటన గురించి కచ్చితమైన తేదీలను ఆయన వెల్లడించలేదు. ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత వేగంగా అభివృద్ధి

చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశం ఒకటి అని కొనియాడిన లక్సన్, న్యూజిలాండ్ ఆర్థిక శ్రేయస్సుకు భారత్ ఎంతో కీలకమైనదని స్పష్టం చేశారు. “ఏప్రిల్‌లో కుదిరిన ‘న్యూజిలాండ్-ఇండియా ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్’ (ఎఫ్‌టీఏ) ద్వారా ఇరుదేశాల మధ్య సంబంధాలను మేము తదుపరి స్థాయికి తీసుకెళ్తున్నాం. ఇది న్యూజిలాండ్?కు మరిన్ని ఉద్యోగాలను, అధిక ఎగుమతులను, బలమైన ఆర్థిక వృద్ధిని అందిస్తుంది” అని పేర్కొన్నారు. ఈ ఒప్పందం కొత్త అవకాశాలను తెరుస్తుందని, న్యూజిలాండ్ వస్తు, సేవలకు 1.4 బిలియన్ల (140 కోట్ల) జనాభా కలిగిన భారీ మార్కెట్‌ను అందుబాటులోకి తెస్తుందని లక్సన్ అన్నారు. ఇది కివి (న్యూజిలాండ్) సమాజంలోకి మరింత ఆదాయాన్ని తీసుకువస్తుందని చెప్పారు.

# తీరందాటిన నైరుతి రుతుపవనాలు

నైరుతి రుతుపవనాలు పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాలు తప్ప దేశంలోని దాదాపు అన్ని ప్రాంతాలకు విస్తరించాయి. వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తాజా అల్పపీడన ప్రభావంతోపాటు, ఇతర వాతావరణ పరిస్థితుల వల్ల రానున్న వారం రోజుల్లో దేశవ్యాప్తంగా, అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. సున్నితమైన ప్రాంతాల్లో వరదలు, కొండచరియలు విరిగిపడడం, ఉరుములతో కూడిన గాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

**ఏపీ, తెలంగాణలో విస్తారంగా వర్షాలు**

ఐఎండీ ప్రకారం, ప్రస్తుతం దక్షిణ భారతదేశంలో నైరుతి రుతుపవనాలు చురుకుగా కొనసాగుతున్నాయి. కేరళ, కర్ణాటక, తెలంగాణ, తీరప్రాంత ఆంధ్రప్రదేశ్?, తమిళనాడు, పుదుచ్చేరి, రాయలసీమ ప్రాంతాల్లో రానున్న వారం రోజుల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయి. కేరళ, కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తాయి. తెలంగాణ, రాయలసీమలో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

**మత్స్యకారులకు హై అలర్ట్**

బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో గంటకు 45-55 కి.మీ వేగంతో, గరిష్ఠంగా 65 కి.మీ వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. అందువల్ల గుజరాత్, కొంకణ్, గోవా, కర్ణాటక, కేరళ, లక్షద్వీప్, ఒడిశా, బంగాల్,

ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని ఐఎండీ హెచ్చరించింది. తీరప్రాంత ప్రజలు అధికారుల హెచ్చరికలను నిరంతరం గమనిస్తూ అప్రమత్తం గా ఉండాలని అధికారులు కోరారు. ఈ వర్షాలు ఎండ వేడి నుంచి ఉపశమనం కలిగించి వ్యవసాయ పనులకు ఊతం ఇచ్చినప్పటికీ, సున్నితమైన ప్రాంతాల్లో వరదలు, ప్రకృతి విపత్తులకు దారితీసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది.

# ఉగ్రవాద నిర్మూలనకు ప్రపంచ దేశాలు సహకరించాలి

సరిహద్దు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌పై భారత్ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఉగ్రవాద కార్యకలాపాలకు శాశ్వతంగా మద్దతు నిలిపివేసే వరకు సింధు జలాల ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందని భారత్ పునరుద్ఘాటించింది. అదే సమయంలో అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడుల్ని కూడా తీవ్రంగా ఖండించింది. ఆ దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆందోళనకరం అని పేర్కొంది. దిల్లీలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ విషయాల్ని వెల్లడించారు. సింధు జలాల ఒప్పందంపై భారత వైఖరిలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు.

‘పాకిస్థాన్ నిరంతరం సరిహద్దు దాటి ఉగ్రవాదానికి మద్దతు ఇస్తోంది. అందుకే సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసింది. పాకిస్థాన్ నమ్మదగిన రీతిలో, శాశ్వతంగా ఉగ్రవాదానికి మద్దతు పూర్తిగా విరమించుకోవాలి. అప్పటి వరకు మా వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదు’ అని జైస్వాల్ తెలిపారు. ఇటీవల భారత్-జపాన్ ప్రధానుల సమావేశంలో కూడా ఉగ్రవాదంపై ఇరు దేశాలు ఒకే స్వరంతో స్పందించిన

విషయాన్ని ఆయన గుర్తు చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయే తకైచి సమావేశం అనంతరం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో పాకిస్థాన్ నుంచి పుట్టుకొస్తున్న సరిహద్దు ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండించారు. ఆ ప్రకటనలో ఐక్యరాజ్యసమితి నిషేధిత ఉగ్రసంస్థలైన లష్కరే తోయిబా (హామ), జైషే మహ్మద్ (జీవవీ), అల్ ఖైదా, ఐసిస్ వంటి సంస్థలపై ప్రపంచ దేశాలు సమన్వయంతో కఠిన చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే స్థావరాల్ని పూర్తిగా నిర్మూలించడం, ఉగ్రవాదానికి నిధులు సమకూర్చే వ్యవస్థల్ని ధ్వంసం చేయడం, సరిహద్దుల మీదుగా ఉగ్రవాదుల రాకపోకల్ని పూర్తిగా అడ్డుకోవాలని భారత్- జపాన్ పేర్కొన్నాయి.

# విజయవాడలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పవన్ కల్యాణ్ భేటీ

- మొదటి పేజి తరువాయి

క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈగల్ విభాగానికి సంబంధించిన వార్షిక నివేదికను ఐజీ, పవన్‌కు అందజేశారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, సాధించిన ఫలితాలను నివేదికలో పొందుపరిచారు. అలాగే, సోషల్ మీడియాలో జరుగుతున్న వేధింపులు, ట్రోలింగ్, ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై సైబర్ క్రైమ్ విభాగం తీసుకుంటున్న కఠిన చర్యల గురించి పవన్ కల్యాణ్‌కు వివరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది.

# రైతు భరోసా నిధుల విడుదలలో మరోసారి రేవంత్ ప్రభుత్వం రికార్డు

-మొదటిపేజీ తరువాయి

ఈ విడతలో 4.41 లక్షల మంది రైతులు రైతుభరోసా సాయాన్ని పొందారని మంత్రి తెలిపారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ, ఇప్పటికే మొదటి మూడు విడతలలో 4 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు నిధులు విడుదల చేయగా, ఈ రోజు 4 నుండి 5 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులందరికీ రైతుభరోసా సాయం అందించమన్నారు. ఇప్పటివరకు రైతుభరోసా పథకం కింద మొత్తం 65.76 లక్షల మంది రైతుల ఖాతాలకు రూ.5402.37 కోట్ల సహాయాన్ని ప్రభుత్వం విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు.

# సందిగ్ధంలో అన్నదాతలు

-మొదటిపేజీ తరువాయి

వానాకాలం సాగు సందిగ్ధంలో పడింది. కనీసం పది శాతం వరకు కూడా విత్తనాలు పడలేదు. జలాశయాల్లో నీటినిల్వలు సరిపడా లేకపోవడంతో వరిసాగుకు నీరందే పరిస్థితి లేదు. బావులు, బోరుబావుల్లో నీరు అంతంత మాత్రమే ఉండటంతో పంటలు వేయాలా వద్దా అని అన్నదాతలు సందిగ్ధంలో ఉన్నారు. ఇప్పటికే వరినార్లు పోసి, పత్తి విత్తనాలు నాటినా వర్షాలు లేక ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. “ప్రభుత్వం సన్నరకాల ధాన్యాలు సాగు చేయాలని, ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని చెబుతున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో సాధ్యం కావట్లేదు. అధికారులు సన్నాలు వేయమని చెప్పారు. ఇప్పటికే సమయం అయిపోయింది. ఇప్పుడు విత్తనాలు నాటితే పంటపై ప్రభావం పడుతుంది. వర్షాభావ పరిస్థితుల వల్ల నీరు కూడా లేవు. వరి బదులుగా ప్రత్యామ్నాయ పంటలకు మళ్లాలని అధికారులు చెబుతున్నారు. వర్షాలు ఎక్కువైనట్లయితే ప్రత్యామ్నాయ పంటలకు అనుకూలంగా ఉండదు. సన్నవడ్లపై రూ.500 అదనంగా ఇస్తామని చెబుతున్నారు. అవి మాకు ఎంతమాత్రం గిట్టుబాటు కావడం లేదు. ఈ సన్నరకాల్లో 15 క్వింటాళ్ల కంటే అధిక దిగుబడి రావట్లేదు”

**అరుతడి పంటలే మేలు**

వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఆరుతడి పంటలు వేయాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నా రైతుల్లో స్పందన లేదు. వరిసాగుచేసిన భూముల్లో ముఖ్యంగా నల్లరేగడి నేలలో ఇతర పంటల సాగుకు యోగ్యంకాదని రైతులు చెబుతున్నారు. సన్నరకాల వరి పండించేందుకు కర్షకులు మొగ్గు చూపుతున్నారు. వరి తర్వాత అధికంగా పత్తిని రైతులు సాగుచేసేవారు. రెండు లక్షల సాధారణ సాగు విస్తీర్ణానికి ప్రస్తుతం లక్షఎకరాల్లో వేశారు. భవిష్యత్‌లో వర్షభావ పరిస్థితులు తీవ్రమైతే రైతులు నష్టపోయే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. “వర్షాభావ పరిస్థితుల వల్ల వరి పంటకు బదులుగా పప్పుదినులు, జొన్న, రాగి, సజ్జ లాంటి పంటలు సాగు చేయాల్సిందిగా రైతులకు సూచించాం. ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న డబ్ల్యూజీఎల్44, కేఎన్ఎం 7715, తెలంగాణ సోనా లాంటి విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగింది. నారు పోసుకునే రైతులు ముఖ్యంగా స్వల్పకాలిక సన్నరకాల వరి విత్తనాలను మాత్రమే సాగు చేయాలని సూచిస్తున్నాం” స్వల్పకాలిక పంటలపై రైతులకు అవగాహన : స్వల్పకాలిక, ఆరుతడి పంటలపై రైతువేదికల ద్వారా అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నామని అధికారులు వివరించారు. ప్రభుత్వం సూచించినట్లుగా ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గుచూపితేనే ఎల్‌నినో ప్రభావం, నష్టాల నుంచి బయటపడే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

పెన్ పవర్

MARKAPURAM మార్కాపురం

మార్కాపురం - ప్రకాశం

# ఇకనుంచి మరింత చురుకుగా పని చేయాలి

## -పార్టీలో నీకు మంచి భవిష్యత్తు ఉంది -ఇంటూరి రాజేష్‌కు నారా లోకేష్ భరోసా

## - కందుకూరులో పార్టీ బలోపేతానికి కలిసి పనిచేద్దామని సూచన



**కందుకూరు పెన్ పవర్, జూలై 3:**

జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షులు, కందుకూరు నియోజకవర్గ యువనేత ఇంటూరి రాజేష్ కు విద్య, ఐటీ శాఖ మంత్రి, టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు నారా లోకేష్ ప్రత్యేక ప్రోత్సాహం అందించారు. శుక్రవారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా లోకేష్ రాజేష్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని ఆత్మీయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా రాజేష్‌ను ఉద్దేశించి, "పార్టీలో నీకు మంచి భవిష్యత్తు ఉంది. ఇకనుంచి మరింత చురుకుగా పని చేయాలి. పార్టీ కష్టకాలంలో నీవు చేసిన సేవలు, చూపిన అంకితభావం నాకు బాగా తెలుసు. కందుకూరు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడంలో నీవు చేసిన కృషి అభినందనీయం. పార్టీ నీకు ఎల్లప్పుడూ అండగా ఉంటుంది" అని లోకేష్ పేర్కొన్నారు. అలాగే భవిష్యత్తులో పార్టీ అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దామని, నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలు, ప్రజా అవసరాలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని రాజేష్‌కు సూచించారు. ఎప్పటికప్పుడు తనతో సంప్రదింపులు కొనసాగించాలని కూడా ఆయన సూచించినట్లు సమాచారం. లోకేష్ వ్యాఖ్యలతో ఇంటూరి రాజేష్‌కు పార్టీ అధిష్ఠానం నుంచి మరింత ప్రోత్సాహం లభించినట్లు టీడీపీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. కందుకూరు నియోజకవర్గంలో యువ నాయకత్వానికి పార్టీ ప్రాధాన్యత ఇస్తోందనే సంకేతంగా ఈ భేటీని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ సమావేశంలో ఇంటూరి రాజేష్‌తో పాటు ఆయన సోదరుడు ఇంటూరి రమేష్, పార్టీ సీనియర్ నాయకులు బత్తిని వెంకటేశ్వర్లు, ఘట్టమనేని మోహన్, నలమోతు శ్రీహరి పాల్గొన్నారు.

# శ్రీ పాతాళ నాగేశ్వర స్వామి ఆలయంలో పూర్ణాహుతి హోమం

## టిడిపి నాయకులు ముత్తుముల క్రిష్ణ కిశోర్





**గిద్దలూరు పెన్ పవర్ జులై 3**

గిద్దలూరు పట్టణంలోని శ్రీ పాతాళ నాగేశ్వర స్వామి ఆలయంలో శ్రీ లక్ష్మీ గణపతి స్వామి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతి హోమం , ప్రత్యేక పూజా కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డిభక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, గిద్దలూరు నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ అర్చకులు క్రిష్ణ కిశోర్ రెడ్డి కి వేదాశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# రాబోయే రోజుల్లో దొనకొండ

# దశ, దిశ మారుతుంది





**జిల్లా కలెక్టర్. పి.రాజబాబు**

**దొనకొండ జులై 3 పెన్ పవర్ :**

దర్శి నియోజక వర్గం, దొనకొండ మండల పరిధిలోని దొనకొండ ఇండస్ట్రియల్ పార్కులో బీడీఎల్ ప్రతిపాదిత ప్రాజెక్టు స్థలాన్ని శుక్రవారం డీఆర్డీవో బృందం, జిల్లా కలెక్టర్ శ్రీ పి రాజాబాబు తో కలసి సందర్శించడం జరిగింది. పరిశీలన సందర్భంగా డీఆర్డీవో బృందానికి జిల్లా అధికార యంత్రాంగం ప్రాజెక్టు స్థలానికి సంబంధించిన వివరాలు, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, భవిష్యత్తు విస్తరణ అవకాశాలు తదితర అంశాలను వివరించింది. అనంతరం దొనకొండ ఎంపిడిఓ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, బృందం సభ్యులతో సమావేశమై సదరు ప్రాజెక్టు పై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు ప్రాజెక్టు వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు మీడియాతో మాట్లాడుతూ, ప్రకాశం జిల్లా దొనకొండ ఇండస్ట్రియల్ పార్కులో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు సంబంధించి రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ డీఆర్డీవో ప్రతినిధుల బృందం నేడు ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, దొనకొండ ఇండస్ట్రియల్ పార్కులో బీడీఎల్ ప్రతిపాదిత ప్రాజెక్టు ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, భూమి, రవాణా అనుసంధానం, నీరు, విద్యుత్ తదితర అంశాలపై డీఆర్డీవో బృందం సమగ్రంగా పరిశీలన నిర్వహించిందన్నారు. ప్రాజెక్టు ఏర్పాటుకు అవసరమైన అన్ని విధాల సహకారాన్ని జిల్లా యంత్రాంగం అందిస్తుందని, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో అవసరమైన ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే దొనకొండ ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపు లభించడంతో పాటు ప్రత్యక్షంగా సుమారు 500 మందికి శాశ్వత ఉద్యోగాలు, పరోక్షంగా 2,000 మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని ఆయన అన్నారు. ఈ సమావేశంలో దర్శి నియోజక వర్గ టీడీపీ ఇంచార్జి డా గొట్టిపాటి లక్ష్మి, అద్దంకి ఆర్డీఓ శ్రీమతి విజయ జ్యోతి, ఎపిఐఐసి జిఎం శ్రీ మదన్ మోహన్ రావు, పరిశ్రమల శాఖ జిఎం శ్రీ శ్రీనివాస రావు, జిల్లా ల్యాండ్ సర్వే అధికారి శ్రీ గౌస్ బాషా, పారిశ్రామిక శాఖ ప్రతినిధులు, ఏపీఐఐసీ అధికారులు, రెవెన్యూ విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు కు గిట్టుబాటు వచ్చే విధంగా మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి







-వైకాపా నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి

-లెటర్లు ఇచ్చి స్థానిక ఎమ్మెల్యే పొగాకు రైతులను మోసగిస్తున్నాడు

-మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

-తన బినామీలకు భూములు కట్టబెట్టాలని ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నాడు

- ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు

**కందుకూరు పెన్ పవర్ జూలై 3**

పొగాకు రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వేలం కేంద్రం 27 ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ మద్దతు ధర లేక పొగాకు రైతులు అలమటిస్తుంటే స్థానిక ఎమ్మెల్యే రైతు బిడ్డను నేనని చెప్పుకుంటూ పొగాకు రైతులను నిలువునా మోసగిస్తున్నాడని, తూతూ మంత్రంగా లెటర్లు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నాడని విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను కూడా గాలికి వదిలివేసి రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని చంద్రబాబు నాయుడుని,పవన్ కళ్యాణ్ ని స్థానిక ఎమ్మెల్యేను ఒకే ఒక్క ప్రశ్న అడుగుతున్నాను గిట్టుబాటు ధర కల్పించకపోతే రైతుల కోసం పోరాడడానికి జగన్మోహన్ రెడ్డి ని ఈ నియోజకవర్గానికి పిలిపిస్తానని తెలిపారు.రైతుల పంటకు ఖర్చు ఎంత అయింది మీరు ఇచ్చే రేటు ఎంత ఒక్కసారి సరిచూసుకోవాలని ఈ బూటక నాటకాన్ని ఇప్పటికైనా ఆపాలని అన్నారు. ఎమ్మెల్యే పూర్తిగా పొగాకు రైతుకు న్యాయం చేయడంలో విఫలమైనారని విమర్శించారు. కంపెనీలు అన్నీ రింగు అయ్యి దోచుకుంటే కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యేలు చూస్తున్నారు తప్ప రైతు పంటకు గిట్టుబాటు ధర కల్పించడానికి ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదని ఇదే గనుక జరిగితే రైతులు పక్షాన రోడ్డు మీదకు వచ్చి పోరాటం సాగిస్తానని తెలిపారు. వ్యవసాయ శాఖ మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పొగాకు పంటకు గిట్టుబాటు ధర కోసం రైతుల నిరసన,ఆందోళనను చూసిన తర్వాత రైతు పక్షపాతి మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వేలం కేంద్రాన్ని సందర్శించడం జరిగినదని,పొగాకు రైతు బాధ వర్ణాతీతంగా ఉందని అన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో పొగాకు రైతులకు గిట్టుబాటు ధర వచ్చిందని రైతులే అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల వినాశనం కోరుకుంటూ,రైతులను నిర్లక్ష్యం చేస్తుంది.రైతులను ఎన్ని రకాలుగా మోసం చేస్తుందో దీనిని బట్టి అర్థమవుతుంది అని అన్నారు. రైతులను ఇంత దారుణంగా మోసగించిన ప్రభుత్వం భారతదేశంలోని ఎక్కడా లేదంటే అతిశయోక్తి కాదు.రైతులు తీసుకువచ్చిన పంటను అమ్ముకోవడానికి రెకమండేషన్లు చేయించుకుని తమకు అనుకూలమైన వారికి ఒక రేటు, సాధారణ రైతుకు ఒక రేటు వేయించి దగా చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి కావాలని ఆశపడుతున్న చంద్రబాబు నాయుడు కొడుకు రైతులు గురించి వ్యవసాయం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది లోకేష్ కు ఐదు రకాల పంటలు చూపిస్తా వాటి పేర్లు చెప్తే ఆయన ముఖ్యమంత్రి కావచ్చు అని బహిరంగంగా సవాలు విసిరారు. రైతుల పంటల పట్ల,ఏ ప్రాంతంలో ఏ పంట పండిస్తారు,ఏ పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలో, రైతుల సంస్కృతి ఏమిటో తెలియని లోకేష్ వ్యవసాయం గురించి అవహేళనగా మాట్లాడటం సరైనది కాదని అన్నారు.చంద్రబాబు నాయుడు, లోకేష్ లతో కంపెనీలు ముందుగానే మాట్లాడుకుని రింగుకి మీ ఇష్టప్రకారం దోచుకుని మా వాటా మాకు ఇవ్వమని అంటున్నారు అని విమర్శించారు. రైతు కంటికి కడివిడి దుఃఖంతో పెట్టిన పెట్టుబడులు రాక బ్యారీనికీ నాలుగు లక్షల నష్టం వస్తుంటే కనీసం కూటమి ప్రభుత్వానికి కనికరం లేకుండా పోయింది. కుమ్మక్కైన కంపెనీలు కింటా మీద 15 నుంచి 25 వేలు దాకా దోచుకు తింటున్నారు. రైతుకు గిట్టుబాటు ధర లేదు రైతు పక్షాన నిలబడి ప్రశ్నిస్తే సమస్యకు పరిష్కారం చెప్పకుండా అణచివేయడానికి ప్రయత్నిస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి రైతులు గొంతుగా మారి వారి పక్షాన నిలబడుతున్నాడు ప్రభుత్వం పోలీసులను పురమాయించి కేసులు పెట్టించే పరిస్థితి. ప్రతిపక్షాలు మైకులో మాట్లాడకూడదు, స్లోగన్స్ ఇవ్వకూడదు, రోడ్డుమీద నిలబడి అరవకూడదు,ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడకూడదు చంద్రబాబు నాయుడు, లోకేష్, పవన్ కళ్యాణ్ గురించి నిందించకూడదు ఇన్ని కండిషన్ పెట్టి పర్మిషన్ ఇవ్వడానికి మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా?మహనీయుడు అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగంలో ఏ ఆర్టికల్ ప్రకారం చంద్రబాబు నాయుడు లోకేష్ లను విమర్శించకూడదు అని ఉందో చెప్పాలని అన్నారు. వాక్ స్వాతంత్రం పోయి ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు పోలీసులు కొత్త సాంప్రదాయానికి తెరదీసి రైతులకు మద్దతుగా సంఘీభావం తెలిపిన మా పార్టీ నాయకులు గంగిరెడ్డి, రఫీ, నారయ్య, రమణయ్య లపై అక్రమంగా కేసులు నమోదు చేశారు. కూటమి ప్రభుత్వంలో పోలీసుల ఫిర్యాదుదారులుగా మారి కేసులు పెడుతున్నారు ప్రశ్నించిన వారిని అణిచివేసే విధానంతో రైతుల పట్ల వ్యవహరిస్తున్నారు రైతుల ఆందోళన,ఆవేదన,ఆవేశంగా మారే లోపే కూటమి ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోకపోతే వారి ఆవేశంలో అగ్నికి ఆహుతి అయ్యి మీ పార్టీని బంగాళాఖాతంలో కలిపే రోజు దగ్గరలో ఉన్నాయని అన్నారు. రైతులు పట్ల మీ విధానం దారుణంగా ఉంది పంటలు వేయకుండా భూములను వృధాగా మారితే మీ దోపిడీకి అదే భూములను 99 పైసలకు అమ్ముకుని దోచుకోవాలని చూస్తున్నారని అన్నారు. గిట్టుబాటు ధరలు కల్పించక పోగా యూరియా వేస్తే క్యాన్సర్ వస్తుందని ప్రచారం చేస్తున్నారు. మినుములు సెనగలు, పెసలు, పత్తి, మామిడికాయలు దేనికి గిట్టుబాటు ధర లేదు పండ్లతోటలు, కాయగూరలతో దేనికి రేటు రావడం లేదు స్థానిక ఎమ్మెల్యే తన అవివేకాన్ని బయట పెట్టుకునే విధంగా మాట్లాడుతూ గత వ్యవసాయ శాఖ మంత్రి కి ఏమి తెలుసు అంటున్నాడు అంట నిజమే మీ లాగా చిలక్కొట్టుడు కొట్టడం లేదు రైతులకు అండగా నిలబడటం తప్ప మీలాగా యమ కొట్టుడు కొట్టేది మాకు తెలియదు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలనే సంకల్పంతో జగన్మోహన్ రెడ్డి రామాయపట్నం పోర్టు తెచ్చి 981 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఇచ్చి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 80శాతం నిధులను కేటాయిస్తే దానిని పూర్తి చేయలేని మీరు మాట్లాడటం సరైనది కాదు ప్రతి మంగళవారం నాలుగు,ఐదు వేల కోట్ల అప్పులు తెచ్చే చంద్రబాబు నాయుడు రామాయపట్నం పోర్టుకి నిధులు కేటాయించకుండా ప్రైవేటు వారికి అమ్ముకొడానికి ప్రయత్నిస్తున్నాడు ఇది తెలుసుకోకుండా తెలిసి తెలియని నీ సర్టిఫికేట్ మాకు ఎవరికీ అవసరం లేదు.మీ ప్రభుత్వంలో మా ప్రభుత్వంలో ఏం జరిగిందో తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. రైతుల కోసం వారి సమస్యలను తీర్చాలని పనిచేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతులకు భరోసా కేంద్రం ఏర్పాటు చేసి, ఈ క్రాపు నమోదు చేసి,విలేజ్ అగ్రికల్చర్ ఆఫీసర్ నియమించి, సీఎం ఆప్ ద్వారా కాంపెన్సేషన్ మానిటరింగ్ అగ్రికల్చర్ ఆఫ్ ప్రైస్ అండ్ పొక్రిమెంట్ ద్వారా పంట సాగు విస్తీర్ణం నష్టపరిహారం తెలుసుకొని రైతుకు మేలు చేసే విధంగా వ్యవహరించారు. మీ ప్రభుత్వం లాంటి నీతిమాలినది కాదు రైతులకు సంబంధించి కనీస మద్దతు ధర లేకపోతే మార్క్ఫెడ్, సివిల్ సప్లై జోక్ చేసుకొని మద్దతు ధరకు రైతు పంటను కొనుగోలు చేసే విధంగా చేశాము. ఇవాళ పొగాకుకు మద్దతు ధర లేదు మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయకుండా రైతులను ఆదుకోకుండా వారి శ్రమను దోచుకునే దౌర్భాగ్య ప్రభుత్వం మీది అని అన్నారు. రైతుల వెంట వైసీపీ నడుస్తుంది పొగాకు పంట అంతా అయిపోయాక వచ్చి మద్దతు ధర కల్పిస్తామని షో చేయకుండా రైతులు పక్షాన నిలబడాలని హితవు పలికారు. ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మాట్లాడుతూ 2019- 24 కాలములో రైతులకు ఇబ్బందులు లేకుండా రైతు భరోసా కేంద్రాలు పెట్టి విత్తనాలు,ఎరువులు సప్లై చేసిన ఘనత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీది అని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు విత్తనాల కోసం,ఎరువుల కోసం,పంట అమ్ముకోవడానికి రోడ్లెక్కాల్సిన పరిస్థితి కల్పించారని అన్నాడు. వ్యవసాయం దండగ అని కృత నిశ్చయముతో ఉన్న వ్యక్తి చంద్రబాబు నాయుడు ఆయన వస్తేనే కరువు తాండవిస్తుంది. రైతులపట్ల చిత్తశుద్ధి ఉంటే పొగాకు రైతుకు న్యాయం చేయాలని అన్నారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామి అయిన పొగాకు బోర్డు చైర్మన్ ఈ ప్రాంతం వాడైనప్పటికీ పొగాకు రైతుకు న్యాయం ఆయన కూడా ఏమి చేయటం లేదని అన్నారు. రైతులను నిలువునా నట్టేట ముంచి వారు భూములలో పంటలు సాగు చేయకుండా చేస్తే తమ బినామీదారులకు కట్టబెట్టాలని చూస్తున్నారని, ఇప్పటికే గుడ్లూరు, ఉలవపాడు లో 20 వేల ఎకరాలు భూములను లింగసముద్రం, వి. వి పాలెం మండలాల్లో మైనింగ్ మాఫియా కోసం భూములను కొట్టేయాలని చూస్తున్నారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే పాపాల పుట్టలు అందరికీ తెలుసు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలి మాజీ వ్యవసాయ శాఖ మంత్రిని విమర్శించే స్థాయి నీది కాదు ఆయన కాలిగోటికి కూడా సరిపోవని అన్నారు. పోలీసులు పెద్ద ఎత్తున మోహరించి పొగాకు రైతులను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను అడుగడుగున అడ్డుకున్నారు. వేలం కేంద్రాన్ని సందర్శించడానికి కూడా ప్రతినిధులను పంపకుండా వేలంకేంద్రం గేటులను మూసివేసి రైతులను ఇబ్బంది పాలు చేశారు. వేలం కేంద్రానికి వెళ్లిన రైతు ప్రతినిధులతో వేలం నిర్వహణ అధికారి మాట్లాడుతూ మీరు చెప్పిన విధంగానే పై అధికారులతో మాట్లాడి రైతులకు మంచి ధర కల్పించడానికి ప్రయత్నిస్తానని అన్నారు . బ్రిడ్డులను పరిశీలించిన కాకాని గోవర్ధన్ రెడ్డి బుర్రా మధుసూదన్ యాదవ్ తూమాటి మాధవరావు రైతులకు గిట్టుబాటు ధర కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, కందుకూరు మండల అధ్యక్షులు ఈదర రమేష్,వలేటివారిపాలెం మండల అధ్యక్షులు అనుమోలు లక్ష్మీనరసింహం, లింగసముద్రం మండల అధ్యక్షులు నోటి వెంకటేశ్వరరెడ్డి, ఉలవపాడు మండల అధ్యక్షులు నన్నం పోతురాజు, తోకల కొండయ్య, చీమల వెంకటరాజా, అప్పన బోయిన రాజేష్, గణేశం గంగిరెడ్డి, ఉప్పుటూరి నాగేశ్వరరావు, ముప్పవరపు కిషోర్, రావులకొల్లు బ్రహ్మానందం, నలమోతు చంద్రమౌళి, కట్టా హనుమంతరావు, వల్లూరి.కోటేశ్వరరావు, బిల్లా రమణయ్య, ఎంపీపీ పులి. రమేష్ , గుత్తా గోపి, ఉచ్చులూరి రవీంద్ర, దగ్గుమాటి కోటయ్య, గేరా మనోహర్, తుళ్లూరి ఆదిలక్ష్మి, దేవరకొండ ఆదిలక్ష్మి, కొత్తగొర్ల వసంతలక్ష్మి తన్నీరు ధరణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక గ్రీవెన్స్

## -జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి

**కందుకూరు పెన్ పవర్ జూలై 3:**

క్షేత్రస్థాయిలోనే ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపేందుకు నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి చెప్పారు. శుక్రవారం కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి ' మీకోసం ' కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఆమె పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 237 అర్జీలు వచ్చాయి. వీటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఒక నెలలో ఒకే అసెంబ్లీ నియోజకవర్గంలో నాలుగు సార్లు ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాలు నిర్వహించడ ద్వారా క్షేత్రస్థాయి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం మొత్తం ఈ విధంగా క్షేత్రస్థాయిలోకి వెళ్తున్నట్లు తెలిపారు. ' మీకోసం ' అర్జీలకు సత్వరం సహేతుక పరిష్కారం చూపేందుకు దృష్టి సారించామన్నారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె చెప్పారు. ఆయా



విషయాలలో తహసీల్దారులు, ఆర్డీవోలకు మార్గ నిర్దేశం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సర్క్యులర్ కూడా జారీ చేసిందన్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం మొత్తం ప్రజా క్షేత్రంలోకి రావడం మంచి పరిణామం అన్నారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులు కోరారు. రైతులు



ఎక్కువగా ఈ నియోజకవర్గంలో ఉన్నందున వారి పొలాలకు సంబంధించిన విస్తీర్ణ, ఆన్లైన్ సమస్యలు కూడా ఎక్కువగా ఉన్నాయన్నారు. వీటన్నింటిపై దృష్టి సారించి పరిష్కరించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో డీఆర్వో పి. వెంకటరమణ, సబ్ కలెక్టర్ డి.హిమవంశీ, జడ్పీ సీఈవో చిరంజీవి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, అన్ని శాఖ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వరంగ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు చారిత్రాత్మక నిర్ణయం

-కూటమి ప్రభుత్వానికి ఉద్యోగుల సంక్షేమంపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం

- డైరెక్టర్ పోకూరి రాంబాబు



**కందుకూరు పెన్ పవర్, జూలై 3**

ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీలలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. ఎంఎస్. నెం.45 చారిత్రాత్మక నిర్ణయమని ఆంధ్రప్రదేశ్ విద్య సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం--2014లోని షెడ్యూల్-9, షెడ్యూల్-10పరిధిలోకి వచ్చే ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీలలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని ఆయన తెలిపారు. ఈ నిర్ణయాన్ని 2022 జనవరి 1 నుంచి అమల్లోకి తీసుకురావడం ద్వారా సీనియర్ ఉద్యోగులు, అధికారులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ఈ నిర్ణయం మరోసారి చాటిచెప్పిందని, ప్రభుత్వం ఉద్యోగుల మధ్య ఉన్న పరస్పర విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తుందని రాంబాబు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విద్య సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ ఉద్యోగులతో పాటు ఇతర ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగుల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లకు పోకూరి రాంబాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రమాణ స్వీకార ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే



**కందుకూరు పెన్ పవర్, జూలై 3**

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో, నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం జరగనుంది. పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ నేతలతో కలిసి శుక్రవారం సాయంత్రం సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు వేలాదిగా హాజరవుతారని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని నాయకులకు సూచించారు. తాగునీరు, భోజన వసతులపై చర్చించారు. ఎమ్మెల్యే వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

# నాయి బ్రాహ్మణుల సంఘం నిరసన ర్యాలీ

ఎస్సి ,ఎస్టి , లకు కల్పించిన చట్టాల మాదిరి

నాయి బ్రాహ్మణులకు రక్షణ కల్పించాలని డిమాండ్

నాయి బ్రాహ్మణు లపై దాడులను ఖండించాలి




**గిద్దలూరు పెన్ పవర్ జులై 3**

ప్రకాశం జిల్లా ఒంగోలు లోని ఓ బార్బర్ షాపు లో కమీషన్ పద్ధతిలో పనిచేస్తున్న గుడివాడ మహేందర్ (52) పై రామారావు అనే వ్యక్తి గురువారం షాపు లోని కత్తెర తో గొంతులో పొడిచి చంపిన ఘటన పై గిద్దలూరు పట్టణంలో నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో గిద్దలూరు తహసీల్దార్ ఎమ్. ఆంజనేయ రెడ్డి కి వినతి పత్రం సమర్పించారు. అలాగే మహేందర్ చావుకు కారణమైన రామారావును కఠినంగా శిక్షించాలని, ఎస్సీ, ఎస్టీ లకు ఇస్తున్న రక్షణ చట్టాల మాదిరి తమకు రక్షణ కల్పించే విధంగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మండలం నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు తొండమల్లు బ్రహ్మయ్య ఘటనకు సంబందించిన వివరాలు మీడియాకు తెలిపారు.

# కందుకూరులో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్





**కందుకూరు పెన్ పవర్, జూలై 3**

పట్టణంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. సూర్య బార్ అండ్ రెస్టారెంట్ అధినేత పిడికిటి వెంకటేశ్వర్లు ని కలసి ఘనంగా సన్మానించి, సంస్థ 25వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ, గత 25 సంవత్సరాలుగా కందుకూరు పరిసర ప్రాంత ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందిస్తూ సూర్య బార్ అండ్ రెస్టారెంట్ ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని



అన్నారు. ఇదే సేవాభావంతో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం పామూరు రోడ్డులోని బడేవారిపాలెం గ్రామానికి చెందిన టీచర్ నల్లూరి ప్రసాద్ నూతన గృహప్రవేశం, సత్యనారాయణ స్వామి వ్రతం కార్యక్రమానికి హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కందుకూరు పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో ఇటీవల నూతన గృహప్రవేశం చేసిన గుర్రం వెంకట్రావు నివాసానికి వెళ్లి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ డైరెక్టర్ పోకూరి రాంబాబు, మధు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంపై ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి



**గిద్దలూరు పెన్ పవర్ జులై 3**

గిద్దలూరు నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రయాణిస్తున్న వాహనం కంభం పట్టణం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదానికి గురికావడం అత్యంత విషాదకరమని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి దిగ్భ్రాంతికి వ్యక్త చేశారు ఈ ప్రమాదంలో గిద్దలూరు పట్టణంలోని నల్లబండ బజార్, జంగాల్ కాలనీకి చెందిన నలుగురు మృతి చెందడం, మరో ఆరుగురు గాయపడడం పట్ల ఎమ్మెల్యే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పెళ్లి కార్యక్రమానికి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరగడం ఎంతో బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుకున్నారు . గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశించినట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయం అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# చుండూరి శ్రీకాంత్ పెండ్లి వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి



**గుడ్లూరు, పెన్ పవర్, జులై 03**

గుడ్లూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు చుండూరి శ్రీకాంత్ వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే నాగేశ్వరరావు పాల్గొని, నూతన దంపతులను ఆశీర్వదించారు. తొలుత ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు స్థానిక నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం నూతన దంపతులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, గ్రామ పార్టీ అధ్యక్షులు ఉన్నం వెంకటేశ్వర్లు, పువ్వాడి వేణు, రావూరి వేణు, దామా వెంకటేశ్వర్లు, రాఘవయ్య, కాపులూరి మాల్యాద్రి తదితర నాయకులు పాల్గొన్నారు.

# మహేంద్ర హత్యను ఖండించిన సిపిఎం

## – నిందితుడికి కఠిన శిక్ష, బాధిత కుటుంబానికి రూ.50 లక్షల సాయం డిమాండ్





**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 03**

ఒంగోలు నగరంలోని 60 అడుగుల రోడ్డులో క్షవర వృత్తిదారుడు గరిటపల్లి మహేంద్ర హత్యను తీవ్రంగా ఖండిస్తూ నిందితుడు నాగినేని రామారావును కఠినంగా శిక్షించాలని సిపిఎం డిమాండ్ చేసింది. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం, కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఐదు ఎకరాల భూమి, ఇల్లు, ఇంటి స్థలం మంజూరు చేసి ప్రభుత్వం అండగా నిలవాలని కోరింది. శుక్రవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద క్షవర వృత్తిదారులు చేపట్టిన ధర్నా కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూలై 2న పట్టపగలు నగరంలోని అత్యంత రద్దీగా ఉండే 60 అడుగుల రోడ్డు జంక్షన్‌లోని శ్రీనివాస సెలూన్‌లో పనిచేస్తున్న మహేంద్రను అత్యంత కిరాతకంగా హత్య చేయడం దారుణమన్నారు. నిందితుడిని చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నగరంలో హత్యలు, దొంగతనాలు పెరుగుతున్నప్పటికీ శాంతిభద్రతల పరిరక్షణలో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. మద్యం మత్తులో జరిగిన ఈ హత్య ప్రభుత్వం అనుసరిస్తున్న మద్యం విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నప్పటికీ నియంత్రణ చర్యలు లేకపోవడం వల్ల ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని విమర్శించారు. మద్యం విక్రయాలపై కఠిన నిఘా పెట్టి అక్రమాలను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. హత్యకు గురైన మహేంద్ర గుడివాడ ప్రాంతానికి చెందిన వలస కార్మికుడని, కుటుంబ పోషణ కోసం ఒంగోలుకు వచ్చి పనిచేస్తున్నాడని తెలిపారు. అతని మరణంతో భార్య, పిల్లలు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించి, దీర్ఘకాలిక భరోసా కల్పించే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# మద్యం మత్తులో జారి పడి లారీ డ్రైవర్ మృతి

**పుల్లల చెరువు పెన్ పవర్ జూలై 3**

పుల్లలచెరువు మండలంలోని జడ్పీ హైస్కూల్ బాలికల వసతి గృహ సమీపంలో మద్యం మత్తులో జారి పడడంతో ఓ లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆర్. ఉమ్మడివరం గ్రామానికి చెందిన అంబటి వెంకటేశ్వరరెడ్డి (44) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ తరచూ మద్యం సేవించేవాడు. ఈ క్రమంలో జూన్ 29 రాత్రి నుంచి 30వ తేదీ ఉదయం మధ్యలో నూతనంగా నిర్మించిన బాలికల వసతి గృహ సమీపంలో మలవిసర్జన కోసం వెళ్లిన సమయంలో జారి చెట్టు వద్ద పడిపోవడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడి భార్య అంబటి బాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పుల్లలచెరువు పోలీసులు సెక్షన్ 194 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాంబశివరావు తెలిపారు.



# ఆయిల్ ఫామ్ సాగు పై అవగాహన సదస్సు

**పెన్ పవర్, సంతమాగులూరు జులై 3**

సంతమాగులూరు మండలంలోని కొమ్మలపాడు కోపరేటివ్ సొసైటీ ఆఫీస్ కార్యాలయం ఎదుట ఆయిల్ ఫామ్ సాగుపై శుక్రవారం జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గోపీచంద్ ఆధ్వర్యంలో సిరి సీడ్స్ వారు మేలు రకమైన మొక్కలతో సాగు చేపట్టి అధిక అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు అదే విధంగా ప్రభుత్వం దీనిపై హెక్టారుకు 29 వేల రూపాయలు రాయితీ ఇవ్వటం జరుగుతున్నది అదే విధంగా అంతర్ పంటల కింద 5250 రాయితీ ఇవ్వటం జరుగుతుంది అన్నారు. ప్రతి రైతు ఆయిల్ ఫామ్ సాగు పై అవగాహన కలిగి అధిక దిగుబడులు సాధించి ఎక్కువ మొత్తములో సాధించవచ్చు అన్నారు. అద్దంకి డివిజినల్ హెచ్ ఓ దీప్తి మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ తోపాటు అంతర పంటలను పండించుకోవచ్చని వీటివల్ల అధిక లాభాలు అర్జించవచ్చని పీఎండిఎస్ 30 రకాల విత్తనాలువేసుకోవడం వలన భూమిలో పోషక విలువలను పెంచుకోవచ్చని అన్నారు. రసాయనగా ఎరువులు వాడకుండా పిఎండిఎస్ వల్ల అనేక రకాల పోషక విలువలు భూమిలో లభించడం జరుగుతుందని




వాతావరణ కాలుష్యాన్ని పర్యావరణ కాలుష్యాన్ని కాపాడిన వాళ్ళ మోతామని అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిరి సీడ్స్ మేనేజర్ వెంకటేష్ సైంటిస్ట్ ఎం ఠాగూర్ విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ తన్నీరు హరి జాన్ బాషా ఐ సి ఆర్ పి కాలేశా గారి వలి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమ్మో.. ఎంత ఘోరం జరిగింది

## పెళ్ళింట పెను విషాదం.. ఆటోను ఢీకొట్టిన లారీ -పెళ్లి వారి బృందంలో 4 గురు మృతి

## అర్ధరాత్రి జరిగిన పెను విషాదం. జరిగిన సంఘటనతో ఉలిక్కిపడ్డ పెళ్లి బృందం - జరిగిన సంఘటనతో ఆగిపోయిన పెళ్లి





**పెన్ పవర్, కంభం జూలై 3**

సంతోషంగా జరగాల్సిన పెళ్లి.. పెళ్లి కుమారుని ఇంటికి చేరుకోవాల్సిన పెళ్లి కూతురు ఆశలు కన్నీళ్ళతో జరిగిపోయాయి . మరి కొద్ది నిమిషాలలో పెళ్లి కుమారుని ఇంటికి చేరుకోవలసిన ఆ కుటుంబ సభ్యుల సంతోషం ఆవిరైపోయింది. కంభం చేరుకొని వినాయకుని గుడి వద్ద కొబ్బరికాయ కొట్టి వరుని కుటుంబానికి వెళ్లాల్సి ఉన్నది. అర్ధరాత్రి పైగా హైవే రోడ్డు జరగాల్సింది జరిగిపోయింది. కంభం పట్టణంలోని వినాయకుని గుడి వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లి బృందంతో కూడిన ఆటోను లారీ బలంగా ఢీ కొట్టింది. అందులో ఉన్న ఆవుల అలకనంద 19 ఆవుల అంకాలు 20 ఆవుల నగేష్ 17 ఆవుల నాగేశ్వరి2 వీరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఎనిమిది మందికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వీరంతా గిద్దలూరు కు చెందినవారు . జరిగిన సంఘటనతో పెళ్లి బృందం దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. అర్ధరాత్రి స్థానికులు గుర్తించి గాయపడ్డ వారిని వెంటనే కంభం వైద్యశాలలో చేర్పించారు. వారికి ప్రాథమిక చికిత్సలు అందజేశారు. అయ్యో దేవుడా.. పెళ్లి కుమార్తె ఆవుల వీరక్క మనసంతా ఆనందంతో మరి కాసేపట్లో పెళ్లి చేసుకుని జీవితాంతం ఆనందంగా ఉంటాననుకున్నా ఆ యువతి ఆశలు క్షణాల్లో ఆవిరయ్యాయి.

ఊహించని ప్రమాదం ఆమె జీవితంలో విషాదాన్ని నింపింది .కళ్ళ ఎదుట ప్రేమగా చూసుకుని అన్నలు ఆప్యాయంగా దగ్గరికి తీసుకుని వదిన నవ్వులతో ఉండే మేనకోడలి ప్రాణాలు గాల్లో కలిసిపోవడంతో దిక్కు తోచని పరిస్థితిలో పెళ్లికూతురు రోదిస్తున్న తీరు చూపర్లను సైతం కంటతడి పెట్టేస్తోంది. సంఘటన స్థలానికి మార్కాపురం డి.ఎస్.పి నాగరాజు కంభం సీఐ మల్లికార్జున ఎస్ఐ శివకృష్ణారెడ్డి చేరుకొని సంఘటన జరిగిన తీరును పరిశీలించారు. అతివేగమా మద్యం మత్తులో ఢీ కొట్టింది తేలాల్సి ఉన్నది. లారీ మదనపల్లి నుండి ఖమ్మం జిల్లా వైరాకు వెళ్తుండగా పెళ్లి బృందం ఆటోను బలంగా ఢీ కొట్టినట్లు పోలీసులు గుర్తించారు అంతేకాక అంతటితో ఆగక పక్కనే ఆగి ఉన్న మరో ద్విచక్ర వాహనాలపైకి బొలెరో వాహనంపై సమీపంలో ఉన్న బంకులోకి లారీ దూసుకుపోయినట్లు గుర్తించారు. జరిగిన సంఘటనతో పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# రాచర్ల ఎస్సైగా మణిపాటి శివ







**గిద్దలూరు పెన్ పవర్ జూలై 3**

రాచర్ల ఎస్సైగా మణి పాటి శివ శుక్రవారం బాధ్యత లను స్వీకరించారు. నూతన ఎస్సైకి స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు భాద్యతలు స్వీకరించిన ఎస్సై మాట్లాడుతూ. ప్రజలకు సత్వర న్యాయం, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యమని నేరాల నియంత్రణ, అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శకంగా విధులు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య ను మర్యాదపూర్వకంగా కలిశారు.

# ప్రమాదాలకు నిలయమైన జంక్షన్‌లో రోడ్డుకు అడ్డంగా హోర్డింగ్ బోర్డులు

**-వెంటనే తొలగించాలని టీడీపీ నాయకుడు సోమినేని కొండలరావు డిమాండ్**







**కందుకూరు పెన్ పవర్, జూలై 3**

కొండముడుసుపాలెం గ్రామ సమీపంలోని మానుగుంట మహీధర్ రెడ్డి కాలనీ జంక్షన్ వద్ద రహదారికి అడ్డంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్ బోర్డులను వెంటనే తొలగించి, ప్రమాదాలను నివారించే చర్యలు చేపట్టాలని కొండముడుసుపాలెం గ్రామ టీడీపీ నాయకుడు సోమినేని కొండలరావు సంబంధిత అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరాయకొండ--మాలకొండ దేవస్థానం--పామూరు హైవే ఫ్లైఓవర్ నిర్మాణ పనులు వివిధ కారణాలతో నిలిచిపోవడంతో ఆ ప్రాంతంలో ఇప్పటికే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో రహదారికి అడ్డంగా హోర్డింగ్ బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాల ముప్పు మరింత పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. కందుకూరు--గుడ్లూరు ప్రధాన రహదారి, కందుకూరు నుంచి మాలకొండ--పామూరు వైపు వెళ్లే హైవేలు కలిసే ఈ జంక్షన్‌లో గతంలో అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని పలువురు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ఇప్పటికే ప్రమాదకరంగా ఉన్న ఈ ప్రాంతంలో రోడ్డులోకి చొచ్చుకొచ్చే విధంగా హోర్డింగ్ బోర్డులు ఏర్పాటు చేయడం వాహనదారుల దృష్టిని మరల్చి మరిన్ని ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాల భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రహదారికి అడ్డంగా ఉన్న హోర్డింగ్ బోర్డులను తొలగించాలని, అవసరమైతే రహదారికి లోపలి భాగంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సోమినేని కొండలరావు డిమాండ్ చేశారు. ప్రమాదాల నివారణకు అధికారులు వెంటనే చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# అద్దంకిలో 'పల్నాడు హాస్పిటల్స్' ప్రారంభం

**అందరికీ నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం:**

**డాక్టర్ చింతలపూడి. అశోక్ కుమార్**

**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) జూలై 03:**



అద్దంకి పట్టణంలో సరికొత్త, నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు 'పల్నాడు హాస్పిటల్స్' సిద్ధమైందని అద్దంకి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి. అశోక్ కుమార్ తెలిపారు. నేడు (శనివారం, జూలై 4వ తేదీ) ఉదయం 9:30 గంటలకు ఈ నూతన ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరగనుందని పేర్కొన్నారు. నాణ్యమైన వైద్యం ప్రతి ఒక్కరి హక్కు అనే ఉద్దేశంతోనే, అందరికీ అందుబాటులో ఉండేలా ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసి ఆశీస్సులు అందించాలని డాక్టర్ అశోక్ కుమార్ కోరారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం..

## ఏల్చూరులో కలెక్టర్ రాజాబాబు ఆకస్మిక తనిఖీ

## వెనుకబడిన పోలింగ్ బూత్‌లపై అధికారులను ప్రశ్నించిన కలెక్టర్



**పెన్ పవర్, సంతమాగులూరు, జూలై 3**

ఓటరు జాబితాల సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామంలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. మండలంలోని 24, 25 పోలింగ్ బూత్‌లలో ఎన్యుమరేషన్ ప్రక్రియ ఆశించిన స్థాయిలో లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, సంబంధిత సిబ్బందిని ప్రశ్నించి పురోగతిపై ఆరా తీశారు. కార్యక్రమం అమలులో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ప్రజలతో నేరుగా మాట్లాడిన కలెక్టర్**

తనిఖీల సందర్భంగా కలెక్టర్ రాజాబాబు నేరుగా ఓటర్లతో మాట్లాడి సిబ్బంది పనితీరు, ఇంటింటి సర్వే నిర్వహణ, ఫారాల పంపిణీ, ప్రజలకు అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

**మండలంలో 99.5 శాతం ఫారాల పంపిణీ పూర్తి**

సంతమాగులూరు మండలంలో 105 పోలింగ్ కేంద్రాలు, అద్దంకి నియోజకవర్గ పరిధిలో మొత్తం 60 బూత్‌లు ఉండగా 51,682 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 99.5 శాతం పూర్తయిందని, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఇప్పటివరకు 16,500 దరఖాస్తులు పూర్తయ్యాయని వివరించారు.

**నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించేలా ఎస్ఐఆర్ ప్రక్రియ అత్యంత కీలకమని అన్నారు. అందుకే అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి గడువులోపు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎస్ఐఆర్ కీలకం**

ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ఎన్నికల నిర్వహణలో అత్యంత ముఖ్యమైన దశ. కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, ఇతర సవరణల ద్వారా ఓటరు జాబితాను ఖచ్చితంగా రూపొందించడమే ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశ్యం. ఎన్నికల సమయంలో వివాదాలకు తావులేకుండా, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేందుకు ఈ ప్రక్రియ కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచడం ద్వారా కార్యక్రమం మరింత సమర్థవంతంగా ముందుకు సాగుతోంది.ఈ పర్యటనలో అద్దంకి ఆర్డీవో విజయజ్యోతి, తహసీల్దార్ కె. రవిబాబు, డిప్యూటీ తహసీల్దార్ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు కొమరోలు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిపివేత





**కొమరోలు పెన్ పవర్ జూలై 3**

గిద్దలూరు లోని 132/ 33 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ లో నిర్వహించవలసిన అత్యవసర సాంకేతికపరమైన మరమ్మతుల కారణంగా ఈ నెల 4వ తేదీ శనివారం కొమరోలు మండలంలోని అన్ని సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తున్నదని గిద్దలూరు విద్యుత్ శాఖ డీఈఉ బి శేషగిరిరావు, కొమరోలు మండల విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు తెలిపారు. గిద్దలూరు లోని విద్యుత్ సబ్‌స్టేషన్లో ఏర్పడిన సాంకేతిక లోపాలను నివారించే కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకొని 4వ తేదీ శనివారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మండలంలోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి ఉంటుందని వారు తెలిపారు. కావున గృహ వినియోగ దారులు, వ్యవసాయ మోటార్ల వినియోగదారులైన రైతులు విద్యుత్ శాఖ అధికారులు,సిబ్బందికి సహకరించాలని వారి విజ్ఞప్తి చేశారు.

# పదవతరగతిలో 529మార్కులు సాధించిన డి సుభాన్ వలిని సన్మానం

## -చిన్నిసేవాసంస్థ అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్




**గిద్దలూరు పెన్ పవర్ జూలై 3**

రాచర్ల మండలం అనుమలవీడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ మహమ్మద్ రఫీ అధ్యక్షతన పదవతరగతిలో డి సుభాన్ వలి 529 మార్కులు సాధించిన సందర్భంగా అభినందన సభ సన్మాన కార్యక్రమం చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు సందర్భంగా పదవతరగతిలో అత్యధిక మార్కులు 529 సాధించిన డి సుభాన్ వలి ని చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటి అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ మహమ్మద్ రఫీ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటి అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ క్రమ శిక్షణతో ఒక లక్ష్యంతో చదువుకోని పాఠశాలకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు అలాగే పదవతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన డి సుభాన్ వలి ని అభినందించారు ఈ సందర్భంగా పదవతగతిలో విద్యార్థులందరూ మంచి ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు సయ్యద్ మహమ్మద్ రఫీ , ఉపాధ్యాయులను అభినందించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ మహమ్మద్ రఫీ చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటి అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ సొసైటి సభ్యులు వాగిచర్ల చరణ్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో అమడసాని బాలకేశవరెడ్డి

**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 3**

మండలంలోని కోవిలంపాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు, మండల టీడీపీ అధ్యక్షులు బొబ్బూరి రమేష్ సూచనలతో కోవిలంపాడు టీడీపీ అధ్యక్షులు అమడసాని బాలకేశవరెడ్డి రెవెన్యూ అధికారుల సమక్షంలో రైతులకు పాస్ పుస్తకాలను అందజేశారు.ఈ సందర్భంగా అమడసాని బాలకేశవరెడ్డి మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టాదారు పాస్ పుస్తకాలపై మాజీ ముఖ్యమంత్రి జగన్ ఫోటోలను ముద్రించి పంపిణీ చేశారని అన్నారు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎలాంటి వ్యక్తిగత ఫోటోలు లేకుండా, ప్రభుత్వ అధికారిక గుర్తుతోనే పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందజేస్తోందన్నారు. రైతుల హక్కులను పరిరక్షిస్తూ పారదర్శక పాలన అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.





# మందుబాబులకు లక్షా నలభై వేలు జరిమానా..

## ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష - ట్రాఫిక్ సీఐ హజరతయ్య

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 03**




ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు విజిబుల్ పోలీస్ వాహనాల తనిఖీలలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మద్యం సేవించి పట్టుబడిన వారిలో 15 మందిని శుక్రవారం కోర్టు లో హాజరు పరచగా 14 మంది వాహనదారులకు ఒక్కొక్కరికి రూ. పదివేలు చొప్పున రూ. లక్షా నలభై వేలు జరిమానా విధించారని, ఒకరికి 2 రోజులు జైలు శిక్ష విధించినారని ఒంగోలు ట్రాఫిక్ సీఐ సి.హెచ్. హజరతయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇందులో భాగంగా ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ ధరించకుండా వాహనాలు నడపరాదని తెలిపారు. ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, వాహనాలను అతి వేగంగా నడపరాదని, మైనర్ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. వాహనదారులు మోటారు వాహనాల నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని సిఐ తెలిపారు.

# పోలేరమ్మ తల్లి చల్లని కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలి

### గోపానిపల్లె లో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి పూజలు చేసిన గిద్దలూరు మాజీ శాసనసభ్యులు అన్న రాంబాబు.

**కొమరోలు పెన్ పవర్ జూలై 3**

గ్రామదేవతలైన పోలేరమ్మ తల్లి చల్లని కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని కోరుతూ గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త అన్న రాంబాబు ప్రార్థించారు. కొమరోలు మండలం గోపాని పల్లెలో కొమరోలు పోలీస్ స్టేషన్ సమీపంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు గత నాలుగు రోజులుగా ఘనంగా జరిగాయి. విగ్రహ ప్రతిష్ట వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. వేడుకల ముగింపు సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త అన్నా రాంబాబు పోలేరమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. అన్నా రాంబాబు రాకను పురస్కరించుకొని కొమరోలు జడ్పిటిసి సభ్యులు సారే వెంకట నాయుడు,మండల వైసీపీ సీనియర్ నాయకులు నాదెళ్ళ వెంగయ్య చౌదరి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు షేక్ మౌలాలి, ఎంపీటీసీలు ఎస్ఎం సుభాని, ఎన్ తిరుపతి రాజు,జాజం వెంకటరమణ, వైసిపి నాయకులు చెదుళ్ళ రమణా రెడ్డి,వీరం రెడ్డి మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, బంగారు విశ్వరూపం, గోల్కొండ అబ్దుల్ సుభాన్, చాంద్ బాషా,అబ్దుల్ సత్తార్, నేపాలి ఖాజా తదితర నేతలు అన్నారాంబాబును శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించి ఘన స్వాగతం పలికారు. అనంతరం



వైసీపీ నేతలు కార్యకర్తలతో పోలేరమ్మ తల్లి ఆలయానికి చేరుకున్న అన్న రాంబాబుకు ఆలయ వేద పండితులు హరి కుమార శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆ సందర్భంగా ఆలయంలో అన్న రాంబాబు పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతలను ఆరాధించడం, వారికి ఆలయాలు నిర్మించడం, తిరుణాలలు, వేడుకలు నిర్వహించడం అనాదిగా వస్తున్న సాంప్రదాయమని, అదే సాంప్రదాయాన్ని ప్రతి గ్రామంలో కొనసాగించాలని ఆయన కోరారు. గ్రామదేవతల కరుణాకటాక్షాల వల్ల గ్రామాలు సుఖశాంతులు పాడిపంటలతో తులతూగుతూ ఉంటాయని ప్రజలలు ఆయురారోగ్యాలతో, సిరి సంపదలతో సుఖమైన జీవితం



గడుపుతూ ఉంటారని ఆయన తెలిపారు. పోలేరమ్మ తల్లి చల్లని కరుణాకటాక్షాలు, నిండు ఆశీర్వాదాలు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని తాను పోలేరమ్మ తల్లిని ప్రార్థించినట్లుగా ఆయన తెలిపారు. ఆ కార్యక్రమంలో మెడికల్ స్టోర్ గర్రె శేషు, రిటైర్డ్ ఉపాధ్యాయులు మరియాల సుబ్బారావు, పేటేటి వెంకట్రామయ్య, మేడం వెంగల రెడ్డి, ఉమ్మడి వెంకటేశ్వర చౌదరి, ఉలాపు రామచంద్రుడు, ప్రసాద్, నరసింహులు,వైసిపి సోషల్ మీడియా ప్రతినిధి పవన్ కళ్యాణ్ తో పాటు పలువురు నేతలు కార్యకర్తలు పోలేరమ్మ తల్లి ఆలయ అభివృద్ధి,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నెల్లూరు పార్లమెంట్ జనసేన సాధకుల సమావేశంలో కందుకూరు నేతలు

### -నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నారాయణ నాయక్‌తో ముచ్చటించిన జనసేన నాయకులు





**కందుకూరు పెన్ పవర్, జూలై 3**

కందుకూరు నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ నాయకులు నెల్లూరు పార్లమెంట్ పరిధిలో నిర్వహించిన జనసేన సాధకుల సమావేశంలో పాల్గొన్నారు. పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై నిర్వహించిన ఈ సమావేశంలో కందుకూరు నియోజకవర్గం నుంచి పలువురు నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా బొమ్మిరెడ్డి నారాయణ నాయక్ తో కందుకూరు జనసేన నాయకులు ఆత్మీయంగా సమావేశమై పార్టీ కార్యక్రమాలు, నియోజకవర్గ పరిస్థితులు, ప్రజా సమస్యలు సంస్థాగత అంశాలపై చర్చించారు. సమావేశంలో జనసేన నాయకులు దారం రాఘవ, దారం మహేష్, దాసరి సాయి, ఆవుల రవి, గోకరాజు మదన్ కుమార్, ఆనాల గోపీకృష్ణ పాల్గొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.

# క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే సోదరుడు కృష్ణ కిషోర్

### ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మట్టి ఖర్చులకు 50 వేలు సాయం

### మృతుల కుటుంబసభ్యులను

### ఫోన్లో పరామర్శించిన ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు పెన్ పవర్ జులై 3**

గిద్దలూరు కు చెందిన పలువురు ప్రయాణిస్తున్న వాహనం కంభం పట్టణం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదానికి గురికావడం అత్యంత విషాదకరమని తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి తెలిపారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే ఆదేశానుసారం క్రిష్ణ కిశోర్ రెడ్డి కంభం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతులను , క్షతగాత్రులను పరామర్శించారు అనంతరం ప్రమాద సంఘటన స్థలానికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరు పరిశీలించారు. ఈ ప్రమాదంలో గిద్దలూరు పట్టణంలోని నల్లబండ బజార్, జంగాల్ కాలనీకి చెందిన నలుగురు మృతి చెందడం, మరో ఆరుగురు గాయపడడం పట్ల క్రిష్ణ కిశోర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పెళ్లి కార్యక్రమానికి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరగడం ఎంతో బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, బాధిత కుటుంబాలకు మట్టి ఖర్చుల నిమిత్తం తక్షణ సహాయం గా 50,000 రూపాయలు ఎమ్మెల్యే ఆదేశానుసారం సోదరుడు క్రిష్ణ కిశోర్ రెడ్డి అందించారు వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి వైద్యులతో ఫోన్ లో మాట్లాడి గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించినారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయం అందేలా కృషి చేస్తామని క్రిష్ణ కిశోర్ భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో గిద్దలూరు, నల్లబండబజార్, 17 వార్డు అధ్యక్షులు పిడతల రవి, రాష్ట్ర ఐటీడీపి కార్యనిర్వహణ కార్యదర్శి దూదేకుల దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి వర్మను కలిసిన జిల్లా ఎస్ పీ హర్షవర్ధన్ రాజు

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 03**

భీమవరం నుండి కడపకు బయలుదేరి మార్గం మధ్యలో ఉదయం ఒంగోలు పోలీస్ ట్రైనింగ్ కాలేజీకి చేరుకున్న కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ ని పుష్ప గుచ్చం అందించి ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, మర్యాదపూర్వకంగా కలిశారు.



# బిఎల్ ఏ లు అప్రమత్తంగా ఉండాలి

### యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్





**పెద్దారవీడు పెన్ పవర్ జూలై 3**

యర్రగొండపాలెం నియోజకవర్గంలో కొనసాగుతున్న సర్ ప్రక్రియపై శాసనసభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ తాటిపర్తి చంద్రశేఖర్ గారు ప్రత్యేక పర్యటన చేపట్టారు. ఇందులో భాగంగా పెద్దారవీడు మండలం తోకపల్లి మరియు సానికవరం గ్రామాలలో బూత్ లెవెల్ అసిస్టెంట్లతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సర్ ప్రక్రియ గురించి వివరించిన ఎమ్మెల్యే, ఈ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో బిఎల్ఎ లు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు.పార్టీ ప్రతిష్టాత్మకంగా అందుబాటులోకి తీసుకువచ్చిన 'మై బూత్ మై ఓటర్' యాప్‌ను ప్రతి ఒక్క బిఎల్ఎ తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. డిజిటల్ విధానం ద్వారా ఓటర్ల వివరాలను పక్కాగా క్రోడీకరించాలని పిలుపునిచ్చారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుల ఓట్లు అక్రమంగా తొలగించకుండా బి ఎల్ ఏ లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే చంద్రశేఖర్ స్పష్టం చేశారు. స్థానిక ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఓటరుకూ ఎన్యూమరేషన్ ఫారం అందజేయడంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా, అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి,మండల బూత్ కన్వీనర్ ఒద్దుల లక్ష్మిరెడ్డి,నియోజకవర్గ బూత్ కన్వీనర్ ఒంగోలు సుబ్బారెడ్డి, వైసీపీ రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి ఏరువ సేనారెడ్డి,మాజీ సర్పంచ్ లు జిల్లెల్ల మల్లీశ్వరి, మూల రమణ రెడ్డి,సీనియర్ నాయకులు దుద్దెల వెంకట రెడ్డి, బిఎల్ఏలు నాగలక్ష్మి రెడ్డి,పోటు గంగయ్య,ఆంజనేయులు,మండల సోషల్ మీడియా కన్వీనర్ సొంటి నాగార్జున రెడ్డి,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ పాతాళ నాగేశ్వరస్వామి ఆలయంలో ఉపాలయాల

### ప్రతిష్ఠోత్సవంలో అన్నా"ప్రత్యేక పూజలు





**గిద్దలూరు పెన్ పవర్ జూలై 3**

గిద్దలూరు పట్టణంలోని పురాతన పౌరాణిక,చారిత్రక ప్రాశస్త్యం కలిగిన సుప్రసిద్ధ శ్రీ పాతాళ నాగేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీ గణపతి,శ్రీవల్లీ దేవసేన షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠోత్సవంలో గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇంచార్జి అన్నా రాంబాబు శుక్రవారం పాల్గొన్నారు శ్రీ పాతాళ నాగేశ్వరస్వామి ఆలయ సముదాయం అభివృద్ధిలో భాగంగా గతంలో 2019-24మధ్య శ్రీ అన్నా రాంబాబు స్వీయ పర్యవేక్షణలో పలువురు దాతలు, దేవాదాయ శాఖ సమన్వయంతో కోట్లాది రూపాయల నిధులను సమకూర్చి పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఆ క్రమంలో దేవాలయ ప్రాంగణంలో ఉపాలయాల నిర్మాణానికి దాతలు శ్రీ కారం చుట్టారు. వాటిలో లక్ష్మీగణపతి,శ్రీవల్లీ దేవసేన షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల నిర్మాణం పూర్తి కావడంతో వేద పండితుల మార్గదర్శనంలోజూన్ 30వ తేదీ నుంచి జూలై 3వరకు నిర్మాణ దాతలు విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి ఆహ్వానం మేరకు అన్నా రాంబాబు ఆలయాన్ని సందర్శించి,ప్రతిష్ఠ ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం శ్రీ పాతాళ నాగేశ్వర స్వామి వారిని, పార్వతి దేవి ,అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ప్రతిష్ఠ ఉత్సవ నిర్వాహకులు,స్థానిక నాయకులు అన్నా రాంబాబుకు ఆలయమర్యాదలతో సాదర స్వాగతం పలికారు.

# కామేపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. వ్యక్తి మృతి



**పెన్ పవర్, సంతమాగులూరు, జూలై 3,**



గుంటూరు--కర్నూలు ప్రధాన రహదారిపై సంతమాగులూరు మండలం కామేపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కామేపల్లి గ్రామానికి చెందిన పంచాయతీ శ్రీ వీరబ్రహ్మాచారి (50) మృతి చెందాడు. సంతమాగులూరు సీఐ పి. శేషగిరిరావు తెలిపిన వివరాల ప్రకారం, వీరబ్రహ్మాచారి తన ద్విచక్ర వాహనంపై కామేపల్లి నుంచి సంతమాగులూరు వైపు వస్తుండగా, నరసరావుపేట వైపు నుంచి వినుకొండ దిశగా వెళ్తున్న బొలెరో వాహనం అతివేగంగా, నిర్లక్ష్యంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# సర్ ప్రక్రియకు ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం

### తహసిల్దార్ కె ధర్మ తేజ

**సి.ఎస్.పురం, పెన్ పవర్ జూలై 3**

ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ-2026 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 4, 5 తేదీల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మండల తహసీల్దార్ కె. ధర్మతేజ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలు చురుకుగా పాల్గొని తమ వివరాలను సరిచేసుకోవాలని కోరారు.ఈ రెండు రోజుల పాటు మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవల్ ఆఫీసర్లు (బి ఎల్ వో లు) ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారని అన్నారు ఓటర్లు తమ కుటుంబ సభ్యులకు సంబంధించిన రెండు కలర్ ఫొటోలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఇతర గుర్తింపు పత్రాలు, ఎన్యుమరేషన్ ఫారాలతో సంబంధిత పోలింగ్ కేంద్రాలకు వెళ్లి బి ఎల్ వో లకు అందజేసి సహకరించాలని కోరారు. అలాగే ప్రజల సౌకర్యార్థం మండల కేంద్రంలోని సి.ఎస్.పురం బస్టాండ్ సెంటర్లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# సర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి -ఆర్డీవో టి అజయ్ కుమార్

**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 3**

ఓటర్ల ఎన్యుమరేషన్ ప్రక్రియ నమోదు శాతం తక్కువగా ఉందని ప్రజలతో మమేకమై సర్ ప్రక్రియను వేగవంతం చేయాలని కనిగిరి ఆర్డీవో టి అజయ్ కుమార్ తెలిపారు మండల కేంద్రం లోని సి.ఎస్.పురం విబిజి రామ్ కార్యాలయం నందు శుక్రవారం మండలంలోని బీఎల్వోలు, బిఎల్ఏ లకు కనిగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి టి. అజయ్ కుమార్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఓటర్ల ఎన్యుమరేషన్ ఫారాలను సక్రమంగా నింపే విధానం, నమోదు ప్రక్రియలో పాటించాల్సిన నిబంధనలు, అవసరమైన ధ్రువపత్రాల పరిశీలన తదితర అంశాలపై ఆయన సమగ్రంగా అవగాహన కల్పించారు.ఎన్యుమరేషన్ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలు, సందేహాలపై బీఎల్ఓలు మరియు బిఎల్ఎలు ఆర్డీవో టి అజయ్ కుమార్ కు తెలియపరిచారు వాటికి ఆయన స్పష్టమైన వివరణ ఇచ్చి నివృత్తి చేశారు. ఫారాల పరిశీలనలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని




సూచించారు.ఈ సందర్భంగా ఆర్డీవో టి. అజయ్ కుమార్ మాట్లాడుతూ మండలంలో సర్ నమోదు ప్రక్రియ ఆశించిన స్థాయిలో నమోదు కావడం లేదన్నారు. బి ఎల్ వో లు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో అర్హులైన ప్రతి ఓటర్లను గుర్తించి ఎన్యుమరేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రానున్న రెండు రోజుల పాటు ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఓటర్ల నుంచి ఎన్యుమరేషన్ ఫారాలను స్వీకరించి నమోదు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఓటర్ల జాబితా పారదర్శకంగా, తప్పులులేకుండా రూపొందించేందుకు అధికారులు, బీఎల్వోలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు కేంద్ర రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహించిన నిర్ణీత గడువులోపు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ కె ధర్మ తేజ, మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్, సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు టిడిపి సీనియర్ నాయకులు నాగిశెట్టి చిన్న మాలకొండయ్య, అట్లూరి రామకృష్ణంరాజు, పులి రామిరెడ్డి, మాదినేని లక్ష్మణ్, బిఎల్ఓ లు, బిఎల్ఏ లు, సూపర్వైజర్లు రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పాతాళ నాగేశ్వర స్వామి ఆలయంలో ఉపాలయాల నిర్మాణం

## అంగరంగ వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ







**గిద్దలూరు పెన్ పవర్ జులై 3**

గిద్దలూరు పట్టణంలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ పాతాళ నాగేశ్వర స్వామి ఆలయంలో నూతనంగా ఉపాలయాలను నిర్మించారు. ఈ ఉపాలయాల్లో శ్రీ లక్ష్మీ గణపతి , వల్ల దేవసేన సుబ్రమణ్య స్వామిలా విగ్రహ ప్రతిష్ఠ ఆగమ శాస్త్రం ప్రకారం జగద్గురువు శ్రీ హంపి పీఠాధిపతి విరుపాక్ష విద్యారణ్య భారతి స్వామి చేతుల మీదుగా యంత్రప్రతిష్ఠ చేయగా యాదవల్ల కార్తికేయ శర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఒక ఉపాలయం లోలక్ష్మీ గణపతి విగ్రహం , రెండో ఆలయంలో వల్లీ,దేవసేన సమేత సుబ్రమణ్య స్వామిని వారి వారి వాహనాలను ప్రతిష్టించారు ఈ సందర్భంగా హోమాది క్రతువులు నిర్వహించారు కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు . శివనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది ఈప్రతిష్టా కార్యక్రమం జూన్ 29 నుండి జులై 3 వరకు అత్యంత వైభవంగా సాగింది. వేదపండితు లు దర్భాక అనిల్ శాస్త్రి ఆధ్వర్యంలో వేదపారాయణం హోమాది క్రతువులు నిర్వహించారు. కలశారాధన , హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. నూతన విగ్రహాలకు అధివాసం, ధాన్యాది వాసం , పుష్పదివాసం , క్షీరాది వాసం , గ్రామోత్సవం తదితర కార్యక్రమాలను ఆగమ శాస్త్రం ప్రకారం నిర్వహించారు. శుక్రవారం నాడు విగ్రహ ప్రతిష్టా భక్తుల జయ జయ ద్వానాల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. రెండు ఆలయాలను శిల్పకళాశోభాయమానంగా నిర్మించారు . విగ్రహ ప్రతిష్ఠ అనంతరం వల్ల , దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కళ్యాణం కమణీయంగా నిర్వహిచారు ఏ సందర్భంగా భక్తుల కు అన్నసంతర్పణ చేశారు.

## మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం..



**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) జూలై 03**

కొరిశపాడు మండలం, మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మానసిక ఉల్లాసం, వ్యక్తిత్వ వికాసం, విద్యా సంబంధిత అంశాలపై శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సైకాలజిస్ట్ (మానసిక నిపుణురాలు) ఇ. కళ్యాణి విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. చదువుతో పాటు విద్యార్థులు మానసికంగా ఎలా దృఢంగా ఉండాలనే దానిపై ఆమె పలు విలువైన సూచనలు, సలహాలు అందించారు.

**ఒత్తిడిని జయించి.. లక్ష్యం వైపు సాగాలి.**

విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ నిర్దిష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకుని ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని ఆమె సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిని ఎలా జయించాలి, చదువుపై ఏకాగ్రతను ఎలా పెంపొందించుకోవాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంజనాదేవి, ఉపాధ్యాయ బృందం, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటి స్థలాల కోసం ప్రభుత్వ భూమిని పరిశీలించిన ఆర్డీవో టి అజయ్ కుమార్





**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 3**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం లో ఇంటి స్థలాల కేటాయింపునకు ప్రభుత్వ భూమిని కనిగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి తోట అజయ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు అందించే దిశగా ప్రభుత్వ స్థలాల లభ్యత, అనుకూలతపై అధికారులతో మరియు టిడిపి నాయకులతో కలిసి ఆర్డిఓ టి అజయ్ కుమార్ చర్చించారు ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ మాట్లాడుతూ పట్టణంలో అనేక మంది నిరుపేదలు సొంత ఇంటి స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి ఇంటి స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో తోట అజయ్ కుమార్, భూమిపై సమగ్ర సర్వే నిర్వహించి పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని మండల రెవెన్యూ అధికారి కె. ధర్మతేజకు ఆదేశించారు.ఈ సందర్భంగా ఆర్డీవో తోట అజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా భూమి అర్హతను పరిశీలించి, సర్వే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. ఇల్లు లేని అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఇంటి స్థలాలు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ కె ధర్మ తేజ, సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు నాగిశెట్టి చిన్న మాలకొండయ్య, అట్లూరి రామకృష్ణంరాజు, టిడిపి నాయకులు మన్నేపల్లి శ్రీనివాసులు, గజ్జల కోటిరెడ్డి, వల్లపుశెట్టి వెంకటనారాయణ, బత్తుల వెంకటాద్రి, రెవెన్యూ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో ముస్లింల సంక్షేమం

## – రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మౌలానా షేక్ ఆబిద్ ఖాస్మీ

**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 03**

ముస్లింలకు అత్యంత పవిత్రమైన హజ్ యాత్ర ను పూర్తి చేసుకుని తిరిగి వారి స్వస్థలాలకు వెళ్ళిన హాజీలకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం లక్ష రూపాయలు సబ్సిడీని వాళ్ళ బ్యాంక్ ఖాతాలకు నేరుగా జమ చేయడం జరిగిందని ఏపీ రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మౌలానా షేక్ ఆబిద్ ఖాస్మీ అన్నారు. టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకులు షేక్ కఫిల్ బాషా, పఠాన్ హనీఫ్ ఖాన్ తో కలిసి మాట్లాడారు. విజయవాడ విమానాశ్రయం నుండి హజ్ యాత్రకు వెళ్లిన 331 మంది హాజీలకు మూడు కోట్ల రూపాయల 31 లక్ష రూపాయలు వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేయడం ముస్లిం పట్ల కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. కూటమి ప్రభుత్వంలో ముస్లిం సంక్షేమానికి వారి ఆధ్యాత్మిక సామాజిక అవసరాలకు రాజన్న వస్తుందన్న సంగతి మరోమారు బహిర్గతం అయిందన్నారు. కూటమి ప్రభుత్వంలో హాజీలకు సబ్సిడీ రాదని కొంతమంది వైకాపా ముస్లిం నాయకులు అపోహలు సృష్టించారని హాజీల అకౌంట్లో లక్ష రూపాయలు జమ అవ్వటంతో వారి నోట మాట రావడం లేదని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి హజ్ యాత్ర చేయదలచుకున్న వారు విజయవాడ విమానాశ్రయాన్ని ఎన్నుకోవాల్సిందిగా ఆబిద్ ఖాస్మీ విజ్ఞప్తి చేశారు. టిడిపి రాష్ట్ర మైనార్టీ నాయకులు కఫిల్ బాషా.. పఠాన్ హనీఫ్ ఖాన్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతోటే ముస్లిం సంక్షేమానికి ప్రభుత్వాలు నడుము కట్టాయని పేర్కొన్నారు రెండవ అధికారిక భాషగా హైదరాబాద్ లో హజ్ హౌస్ నిర్మాణం, హజ్ యాత్రికులకు సబ్సిడీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా



విద్యా.. ఉపాధి రంగాలలో రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా బలోపేతం చేయడం, అలా అనేక సంస్కరణలు తెలుగుదేశం పార్టీ పాలనలోనే పురుడు పోసుకున్నియని అన్నారు. అబద్దాలను ప్రచారం చేయటంలో అసత్యాలను వల్లేవేటంలో దిట్టగా పేరుందిన వైకాపా శ్రేణులు హాజీలకు లక్ష రూపాయలు సబ్సిడీ రాదంటూ అపోహలు సృష్టించి హాజీలను అయోమయానికి గురిచేసి టిడిపి పై బురదజల్లే ప్రయత్నం వారి దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని విమర్శించారు. ముస్లిం సంక్షేమానికి వారి రాజకీయ సామాజిక ఆధ్యాత్మిక ఉపాధి విద్యా రంగాలలో అండగా నిలబడింది నిలబడేది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఆయన సంగతి ముస్లిం సమాజం గుర్తించిందని వైకాపా సత్యాలు దుష్ప్రచారాలు నమ్మే దుస్థితిలో ముస్లిం సమాజం వేదన సంగతి వైకాపా ఫేక్ బ్యాచ్ గుర్తుంచుకుంటే చాలని దుయ్యబట్టారు.

# మెకానిక్ కార్మికుల సమస్యల పై పార్లమెంటులో ప్రశ్నిస్తా - ఎంపీ మాగుంట

**అంతర్జాతీయ టూ వీలర్స్ డే సందర్భంగా నగరంలో మెకానిక్ లు భారీ ర్యాలీ - పాల్గొన్న ఒడా చైర్మన్ రియాజ్**

**- పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య**





**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూలై 03**

మెకానిక్ రంగంలో ఉన్న కార్మికుల యొక్క సమస్యల పరిష్కారం కోసం తన వంతు పార్లమెంటులో ప్రస్తావించి కార్మికులకు అండగా ఉండే విధంగా చేస్తామని పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసు రెడ్డి అన్నారు. అంతర్జాతీయ టూ వీలర్స్ డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ టూ వీలర్స్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దాయినేని ధర్మా ఆధ్వర్యంలో శుక్రవారం మినీ స్టేడియం వద్ద కేక్ కట్ చేసి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయంగా వచ్చిన 18 85వ సంవత్సరంలో గాడ్ క్లబ్ డైమార్ టూ వీలర్ సృష్టికర్త అని అన్నారు. ఆయన ద్విచక్ర వాహనాన్ని కనుగొని ప్రవేశపెట్టిన వ్యక్తిని ప్రస్తుతం అనేక రకాల వాహనాలు రంగంలోకి వచ్చాయని అన్నారు. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలు పెట్రోల్ వాహనాలు కాకుండా ఎలక్ట్రిక్ వాహనాలు కూడా అందుబాటులోకి వస్తున్నాయని వాటిని కూడా మెకానిజం చేసేందుకు శిక్షణ కార్యక్రమం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ప్రకాశం జిల్లాలో టూ వీలర్స్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఒక పటిష్టమైన సంఘంగా ఉందని దానికి అధ్యక్షుడిగా దాయినేని ధర్మ వ్యవహరిస్తూ కార్మికులందరినీ ఒక తాటిపై తీసుకొచ్చి వారి యొక్క సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని ధర్మా ను అభినందించారు. పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ ఎన్నో సంవత్సరం నుంచి టూ వీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని వారి యొక్క సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అనేక కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నారని తమ వంతు సహాయ సహకార అందిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాచ గొర్ల వెంకటరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, అయినాబత్తిన ఘనశ్యాం, సింగరాజు రాంబాబు, సూపర్ బజార్ మాజీ చైర్మన్ తాతా ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ టూ వీలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు షేక్ షాన్ వాజ్, మార్కాపురం ఉపాధ్యక్షులు షేక్ పేక్షావలి, గిద్దలూరు ఉపాధ్యక్షులు సయ్యద్ షానిషా వలి, దర్శి జనరల్ సెక్రెటరీ షేక్ దర్బార్, ఒంగోలు ట్రెజరర్ సయ్యద్ షౌకత్ అలీ, ఒంగోలు ఆర్గనైజర్ సెక్రెటరీ షేక్ మక్బూల్, ఒంగోలు సెక్రటరీలు షేక్ సుభాని, షేక్ అబ్దుల్ సలీం మరియు తదితర ఎర్రగొండపాలెం పొదిలి అద్దంకి కందుకూరు జాయింట్ సెక్రెటరీలు షేక్ సిలార్ సాహెబ్ షేక్ కరీముల్లా, అడ్డాల శేఖర్, షేక్ నజీర్ భాష, కనిగిరి ప్రచార కార్యదర్శి షేక్ అబ్దుల్ మునీర్, తదితర మెకానిక్, వర్కర్స్ భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## నిశ్చితార్థ వేడుకల్లో టిడిపి నాయకులు

**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 3**

మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ సోదరుడి కుమారుడు బొబ్బూరి మణికంఠ నిశ్చితార్థ వేడుకలు శుక్రవారం మండల కేంద్రంలోని సి.ఎస్.పురం రహిమాన్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, టిడిపి నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఈ వేడుక ఆనందోత్సాహాల మధ్య జరిగింది.ఈ కార్యక్రమానికి హాజరైన టిడిపి నాయకులు కాబోయే వధూవరులను ఆశీర్వదించి ముందస్తు వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ బోయళ్ళ నారాయణరెడ్డి, టిడిపి నాయకులు నాగిశెట్టి చిన్న మాలకొండయ్య, అట్లూరి రామకృష్ణంరాజు, జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ డైరెక్టర్ కోనంగి వెంకటకొండయ్య, మన్నేపల్లి శ్రీనివాసులు, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వడ్లమాని నారాయణ చారి, దొర తిరుపతయ్య, జర్నలిస్టులు జమకాల వెంకటేశ్వర్లు, తీకెనం బాబురావు, చావా చంద్రశేఖర్, రేనాటి వెంకటేశ్వర్లు ,చావా సుబ్బయ్య, దొనపాటి మోహన్ రెడ్డి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నగరపాలక సంస్థ కమిషనర్ వెంకట కృష్ణయ్య విస్తృత తనిఖీలు

**పారిశుద్ధ్యం పై ప్రజలకు అవగాహన కల్పించిన వెంకట కృష్ణయ్య**

**– టీ దుకాణం యజమానికి వెయ్యి రూపాయలు జరిమానా**





**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూలై 03**

ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ వెంకట కృష్ణయ్య శుక్రవారం పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ లో భాగంగా శుక్రవారం త్రోవగుంట, కేశవరాజు కుంట ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో రోడ్డు పై ఉన్న చెత్త కుప్పలను వెంటనే తొలగించాలని సంబధిత శానిటరీ ఇన్స్పెక్టర్ కి ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలతో సంభాషించి వారి ఇంటి వద్దకు ప్రతి రోజు శానిటరీ వర్కర్స్ వచ్చి చెత్తను తీసుకువెళ్తున్నారో లేదో అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ కూడా చెత్తను తడి పొడి చెత్తలుగా వేరు చేసి వర్కర్స్ కి ఇవ్వవలసిందిగా సూచించారు. చెత్తను కాలువల్లో రోడ్ పై వేయకుండా తప్పనిసరిగా శానిటరీ వర్కర్స్ మాత్రమే ఇవ్వవలసిందిగా కోరారు. అనంతరం ఒంగోలు బైపాస్ రోడ్ దగ్గర గల టీ షాప్ వద్ద రోడ్డు పైనే తాగి పారేసిన టీ కప్ లు ఉండటం గమనించి సంబంధిత టీ షాప్ యజమానికి వెయ్యి రూపాయిలు జరిమానా వేయవలసినిదిగా మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ కు ఆదేశించారు. ఇంకొకసారి రోడ్ పైన చెత్త వేయకుండా వాటిని ప్రోగు చేసి శానిటరీ వర్కర్స్ ఇవ్వవలసిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో ఒంగోలు నగరపాలక సంస్థ మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, శానిటరీ సూపర్వైజర్ నూకతోటి పిచ్చయ్య, 1 వ డివిజన్ శానిటరీ ఇన్స్పెక్టర్ మిరియం శ్రీను పాల్గొన్నారు.

## ఇన్సూరెన్స్ కంపెనీకి జరిమానా

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 03**


ఇన్సూరెన్స్ కంపెనీకి జిల్లా వినియోగదారుల కమిషన్ జరిమానా విధించింది. ఉమ్మడి ప్రకాశం జిల్లా పంగులూరు మండలానికి చెందిన కుంచాల శ్రీను భార్య కుంచల రామాంజమ్మ టాటా ఏ. ఐ. ఏ. ఇన్సూరెన్స్ కంపెనీ నందు డిసెంబర్ 2022 సంవత్సరం లో సంపూర్ణ రక్ష అనే పాలసీ నందు 20 లక్షలకు ఇన్సూరెన్స్ చేసుకుంది. ఇందుకుగాను 3122 రూపాయలు ప్రీమియం చెల్లించింది. ఆ తర్వాత తొమ్మిది రోజులకు హార్ట్ ఎటాక్ వల్ల మరణించింది. అనంతరం పాలసీ నామిని అయిన ఆమె భర్త సదరు ఇన్సూరెన్ కంపెనీ వారికి క్లెయిమ్ ఫారం పంపారు . కానీ సదరు ఇన్సూరెన్ కంపెనీ వాళ్ళు పొంతన లేని కారణాలతో క్లెయిమ్ ను తిరస్కరించటంతో ఫిబ్రవరి 2024 సంవత్సరం లో బాధితుడు న్యాయం కోసం జిల్లా వినియోగదారుల కమిషన్ ను ఆశ్రయించాడు. వినియోగదారుల కమిషన్ ఫిర్యాదును పరిశీలించి వాదోపవాదనలు విన్న తర్వాత సదరు ఇన్సూరెన్స్ కంపెనీ వారి సేవాలోపం ను గుర్తించి పూర్తి క్లెయిమ్ అమౌంట్ 20లక్షల రూపాలు 12% వడ్డీ తో చెల్లించాలని అదనంగా 20వేల రూపాలు జరిమానా విధించింది. ఫిర్యాదు ఖర్చు క్రింద 5వేల రూపాలు ఫిర్యాదుదారుడుకి మరియు అతని కుమారులు ముగ్గురికి సరిసమానంగా 45 రోజులలో చెల్లించవలసిందిగా జిల్లా వినియోగ దారుల కమిషన్ అధ్యక్షులు డి.శ్రీదేవి, సభ్యులు వై.సుందర్ రావు, డాక్టర్ సమీరా శుక్రవారం తీర్పుని ఇచ్చారు.

## యూట్యూబ్ ఛానల్ సీఈవో రావణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**– ఒడా చైర్మన్ షేక్ రియాజ్ – తాలూకా పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు**

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 03**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పై దుర్భాషలాడుతూ మాట్లాడిన యూట్యూబ్ ఛానల్ సీఈవో రావణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ఒడా) చైర్మన్ షేక్ రియాజ్ అన్నారు. అసభ్య పదజాలంతో దూషించిన యూట్యూబ్ బర్ రావణపై చర్యలు తీసుకోవాలని కేసు నమోదు చేయాలని ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని దేశంలో అందర్నీ కలుపుకొని పోయి ప్రజాపాలన అందించాలని లక్ష్యంతో పని చేస్తుంటే కొంతమంది కావాలని పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. జనసేన పార్టీ అధినేతపై అవాకులు చవాకులు పేలితే చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనకాడబోమని హెచ్చరించారు. రావణ్ పై వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తాలూకా పోలీసులను కోరినట్లు ఆయన తెలిపారు. అసభ్య పదజాలం తో ఎవరు మాట్లాడిన జనసేన పార్టీ జనసేన సైనికులు చూస్తూ ఊరుకోరని మచ్చుకు ఇది ఒక ఉదాహరణ మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ సాదిక్, జనసేన పార్టీ నాయకులు చిట్టెం ప్రసాద్, కళ్యాణ్ ముత్యాల, పల్లా ప్రమీల, బొందుల శ్రీదేవి, జన సైనికులు పాల్గొన్నారు.







కృతి శెట్టి: బేబీ పింక్‌లో బాడీ - గ్లామ్ ఫోటోషూట్ & రైజింగ్ ఫిల్మ్ కెరీర్

# ప్రతి రోజు ఒక కొత్త బ్రాండ్: కోట్లు కొల్లగొడుతున్న జాన్వీ!



బాలీవుడ్ స్టార్ కిడ్, టాలీవుడ్ క్రేజీ బ్యూటీ జాన్వీ కపూర్ వెండితెరపైనే కాదు.. డిజిటల్ ప్రపంచంలోనూ తిరుగులేని సామ్రాజ్యాన్ని సృష్టిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 2.67 కోట్లకు పైగా ఉన్న ఫాలోయింగ్, ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఉన్న క్రేజ్‌ను ఈ యంగ్ బ్యూటీ క్యాష్ చేసుకుంటున్న తీరు చూస్తుంటే ట్రేడ్ వర్గాలు సైతం ముక్కున వేలేసుకుంటున్నాయి. జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు ఈ భామతో ప్రమోషన్స్ చేయించేందుకు క్యూ కడుతుండటంతో జాన్వీ సోషల్ మీడియా హ్యాండిల్స్ ప్రస్తుతం కార్పొరేట్ కంపెనీల డిజిటల్ షోరూమ్‌లుగా మారిపోయాయి.

ఇన్‌స్టాగ్రామ్‌లో జాన్వీ కపూర్ పోస్ట్ చేసే ఒక్కో ప్రమోషనల్ కంటెంట్ వెనుక భారీ వ్యాపార సామ్రాజ్యం దాగి ఉంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం..ఈ భామ ఒకే ఒక్క యాడ్ పోస్ట్ లేదా రీల్ కోసం సుమారు 7 లక్షల నుండి 10 లక్షల వరకు వసూలు చేస్తోంది. అలాగే ఎక్స్ ఖాతాలో చేసే పోస్టులకు లక్షల్లో డిమాండ్ చేస్తోంది. కేవలం విడివిడి పోస్టులే కాకుండా ఒప్పో, లెన్స్‌కార్ట్, తుమి, హావెల్స్ వంటి అగ్రశ్రేణి కంపెనీలకు గంపగుత్తగా (బల్క్ ప్యాకేజీ) బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ.. ఏడాదికి 1 కోటి నుండి 2.5 కోట్ల వరకు ఒప్పందాలు కుదుర్చుకుంటోందని టాక్ వినిపిస్తోంది.

నెలవారీ లెక్కలు చూస్తే.. జాన్వీ కపూర్ డిజిటల్ ఆదాయం ఊహకందని స్థాయిలో ఉంది. ఒక నెలలో కనీసం డజనుకు పైగా విభిన్న బ్రాండ్స్ (లైఫ్ స్టైల్, గ్యాడ్జెట్స్, బ్యూటీ (ప్రొడక్ట్స్) ప్రకటనలను నిరంతరాయంగా పోస్ట్ చేస్తూనే ఉంటుంది. ఈ రకంగా చూసినా.. సోషల్ మీడియా వేదికల ద్వారానే ఈ బ్యూటీ నెలవారీ ఆదాయం 1.5 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ప్రస్తుతం డిజిటల్ మార్కెట్లో ఇంతటి క్రేజ్, కమర్షియల్ వాల్యూ ఉన్న మరో స్టార్ బ్యూటీ బాలీవుడ్‌లో లేరనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

కేవలం డిజిటల్ ప్రమోషన్స్ మాత్రమే కాకుండా... సినిమాల పరంగానూ జాన్వీ కపూర్ పారితోషికం ఆకాశాన్ని తాకుతోంది. హిందీ చిత్రసీమలో ఈ భామ నటిస్తున్న ఒక్కో సినిమాకు బడ్జెట్ – ప్రొడక్షన్ హౌస్‌ను బట్టి సుమారు 5 కోట్ల నుండి 6 కోట్ల వరకు రెమ్యునరేషన్ అందుకుంటోంది. నటనకు ప్రాధాన్యమున్న పాత్రలతో పాటు గ్లామర్ పాత్రలకు సమన్యాయం చేస్తుండటంతో బాలీవుడ్ మేకర్స్ ఈ యంగ్ బ్యూటీ అడిగినంత ఇచ్చేందుకు వెనుకాడటం లేదు.

మరోవైపు.. సౌత్ ఇండియాలో (టాలీవుడ్‌లో) జాన్వీ కపూర్ ఎంట్రీ ఒక సంచలనంగా మారింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన నటించిన –దేవర– చిత్రానికి గానూ దాదాపు 2 కోట్ల నుండి 3 కోట్ల వరకు పారితోషికం అందుకున్నట్లు టాలీవుడ్ టాక్. ఇక గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ క్రేజీ ప్రాజెక్ట్ –పెద్ది– కోసం దాదాపు 4 కోట్ల పారితోషికాన్ని వసూలు చేసిందని ప్రచారం ఉన్నా.. దానిపై అధికారికంగా క్లారిటీ లేదు. ఇలా సినిమాలు, బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ జాన్వీ కపూర్ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది.



శివంగి వర్మ సొగసైన లుక్స్

# టీమిండియాతో వన్డే సిరీస్‌కు ఇంగ్లండ్ జట్టులో కొత్త ముఖం

**భారత్‌తో వన్డే సిరీస్‌కు 16 మందితో ఇంగ్లండ్ జట్టు ప్రకటన**

**యువ ఆల్‌రౌండర్ జేమ్స్ కోల్స్, పేసర్ జోష్ టంగ్‌లకు తొలిసారిగా చోటు**

**గాయం నుంచి కోలుకుని జట్టులోకి రీఎంట్రీ ఇచ్చిన జోఫ్రా ఆర్చర్**

**కెప్టెన్‌గా హ్యారీ బ్రూక్.. జట్టులో రూట్, బట్లర్ వంటి సీనియర్లు**

**గాయాల కారణంగా బ్రైడన్ కార్స్, జేమీ ఓవర్టన్‌లకు విశ్రాంతి**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ నెలలో భారత్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం ఇంగ్లండ్ తమ జట్టును ప్రకటించింది. 16 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో ఓ కొత్త ఆటగాడికి తొలిసారిగా అవకాశం కల్పించారు. ససెక్స్ యువ ఆల్‌రౌండర్ జేమ్స్ కోల్స్ ను ఈ సిరీస్ కు ఎంపిక చేశారు. టెస్టుల్లో రాణించిన ఫాస్ట్ బౌలర్ జోష్ టంగ్‌కు కూడా తొలిసారిగా వన్డే జట్టు నుంచి పిలుపు అందింది. మరోవైపు, స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ తిరిగి 50 ఓవర్ల జట్టులోకి రావడం ఇంగ్లండ్‌కు బలాన్నిచ్చింది.

2027 ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని ఇంగ్లండ్ జట్టును ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. 21 ఏళ్ల లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్, లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ అయిన జేమ్స్ కోల్స్‌ను దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తుండటంతో జట్టులోకి తీసుకున్నారు. అతనితో పాటు లియామ్ డాసన్‌ను కూడా ఎంపిక చేయడం ద్వారా స్పిన్ బౌలింగ్ వనరులను పటిష్టం చేసుకోవాలని ఇంగ్లండ్ భావిస్తోంది. టెస్టుల్లో మంచి ప్రదర్శన కనబర్చినందుకు జోష్ టంగ్‌కు వన్డేల్లో అవకాశం దక్కింది. గాయాల నుంచి కోలుకున్న గస్ అట్కిన్‌సన్, సాకిబ్ మహమూద్ కూడా తిరిగి జట్టులో చేరారు.

గాయాల కారణంగా బ్రైడన్ కార్స్, జేమీ ఓవర్టన్ ఈ సిరీస్‌కు దూరమయ్యారు. హ్యారీ బ్రూక్ కెప్టెన్సీలో బరిలోకి దిగుతున్న ఈ జట్టులో జోస్ బట్లర్, జో రూట్, బెన్ డకెట్ వంటి అనుభవజ్ఞులైన బ్యాటర్లు ఉన్నారు. మరోవైపు, ఈ సిరీస్ కోసం భారత్ పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగుతోంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా వంటి కీలక ఆటగాళ్లు ఆడనున్నారు. జులై 14న ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి వన్డే జరగనుండగా, 16న కార్డిఫ్, 19న లార్డ్స్‌లో మిగిలిన రెండు మ్యాచ్‌లు జరుగుతాయి.

**ఇంగ్లండ్ వన్డే జట్టు:**

హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జో రూట్, విల్ జాక్స్, బెన్ డకెట్, జోస్ బట్లర్, జాకబ్ బెథెల్, శామ్ కరన్, రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్‌సన్, టామ్ బాంటన్, జేమ్స్ కోల్స్, లియామ్ డాసన్, సాకిబ్ మహమూద్, ఆదిల్ రషీద్, జోష్ టంగ్.

# భారత్‌ను ఓడించడం మా వల్ల కాదు.. టీమిండియాపై పాక్ హెడ్ కోచ్ ప్రశంసలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** వైట్ బాల్ క్రికెట్‌లో భారత జట్టుకి తిరుగులేదని, ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత పవర్‌ఫుల్ జట్టు టీమిండియా అంటూ పాకిస్థాన్ క్రికెట్ జట్టు హెడ్ కోచ్ మైక్ హెస్సన్ ప్రశంసల జల్లు కురిపించాడు. పాకిస్థాన్ మాత్రమే కాకుండా ప్రపంచంలోని ప్రతీ జట్టు ఇండియాని ఓడించడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతుందని ఆయన కొనియాడాడు. ఇటీవల పాకిస్థాన్ జట్టు ప్రదర్శనలపై వస్తున్న విమర్శలకు స్పందిస్తూ మైక్ హెస్సన్ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

**పాకిస్థాన్ కోచ్ మైక్ హెస్సన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్:**

పాక్ జట్టుపై వస్తున్న విమర్శలను తిప్పికొడుతూ మైక్ హెస్సన్ మాట్లాడుతూ.. గతేడాది ఆసియా కప్‌లో భారత్‌తో జరిగిన మ్యాచ్‌లు మినహా మిగిలిన అన్ని మ్యాచ్‌ల్లో మేం గెలిచాం.. వాస్తవం ఏంటంటే ప్రస్తుతం ప్రపంచంలోని ఏ జట్టైనా భారత్‌ను ఓడించడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతోంది. కేవలం పాక్ మాత్రమే కాదు.. ప్రతి జట్టూ ఇదే పరిస్థితిని ఎదుర్కొంటోందన్నాడు. తప్పో ఒప్పో పక్కన పెడితే భారత్‌తో ఆడేటప్పుడు పాకిస్థాన్ ప్రదర్శన ఎలా ఉందన్న దాని ఆధారంగానే మా జట్టును అంచనా వేస్తుంటారు. పాక్ పెద్ద టోర్నీల నాకౌట్ దశల్లో నిలకడగా చోటు దక్కించుకునే జట్టుగా ఎదగాలంటే, కేవలం భారత్ గురించే కాకుండా అన్ని జట్లపైనా క్రమం తప్పకుండా విజయాలు సాధించాల్సి ఉంది.

**భారత్ వర్సెస్ పాక్ హెడ్ టు హెడ్ రికార్డులు:**

ఆసియా కప్ 2025 టోర్నీలో భారత్‌తో ఫైనల్‌తో సహా మూడు మ్యాచ్‌లు ఆడిన పాకిస్థాన్.. ఈ మూడింటిలోనూ ఘోర ఓటమిపాలైంది. అలాగే ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో దాయాదీ దేశాలు ఒకసారి తలపడగా అక్కడ కూడా భారత్‌నే విజయం సాధించింది. వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్లో ఓడినప్పటికీ, ఆ తర్వాత జరిగిన వరుసగా మూడు మెగా టోర్నీల్లో (ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025, ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024, 2026) భారత్ విజేతగా నిలిచి వైట్ బాల్ క్రికెట్‌లో తన ఆధిపత్యాన్ని చాటుకుంది.

**ఇంగ్లాండ్ సిరీస్‌పై భారత్ కన్ను:**

టీ20 ఫార్మాట్‌లో వరుసగా 16 ద్వైపాక్షిక సిరీస్‌లు గెలిచిన రికార్డు ఉన్న భారత్‌కు.. ఇటీవలే పసికూన ఐర్లాండ్ చేతిలో రెండు టీ20ల సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయి ఊహించని షాక్ తగిలింది. ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న ఇండియన్ టీమ్ ఆ ఓటమి నుంచి తేరుకుని తిరిగి పుంజుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఐదు మ్యాచ్‌ల ఈ టీ20 సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా, రెండో టీ20 మ్యాచ్ రేపు (శనివారం) జరగనుంది.

# సౌతాఫ్రికాని ఓడించిన ఇంగ్లాండ్.. ఫైనల్‌లో ఆస్ట్రేలియాతో బ్లాక్‌బస్టర్ పోరు



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల టీ20 వరల్డ్ కప్ రెండో సెమీఫైనల్లో ఇంగ్లాండ్ జట్టు అద్భుత విజయం సాధించింది. గురువారం (జులై 2న) కెన్నింగ్టన్ ఓవల్ వేదికగా జరిగిన ఉత్కంఠభరిత పోరులో సౌతాఫ్రికాపై 40 పరుగుల తేడాతో గెలిచి ఫైనల్లోకి దూసుకెళ్లింది. గత 2023 టీ20 వరల్డ్ కప్, 2025 వన్డే వరల్డ్ కప్ సెమీఫైనల్స్‌లో సౌతాఫ్రికా చేతిలో ఎదురైన పరాజయాలకు ఇంగ్లాండ్ ఈ విజయంతో ప్రతీకారం తీర్చుకుంది. జూలై 5న లార్డ్స్ మైదానంలో జరగబోయే ప్రతిష్టాత్మక ఫైనల్ పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాతో ఇంగ్లాండ్ తలపడనుంది.

**ఇంగ్లాండ్ రికార్డు భాగస్వామ్యం:**

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్‌కు ఆరంభంలో గట్టి షాక్‌లు తగిలాయి. సౌతాఫ్రికా బౌలర్లు మరిజానే కాప్, షబ్నిమ్ ఇస్మాయిల్ ధాటికి పవర్‌ప్లే ముగిసేసరికి ఇంగ్లాండ్ 22 రన్స్‌కే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్రమంలో ఇస్మాయిల్.. అమీ జోన్స్‌ను అవుట్ చేయడంతో మహిళల టీ20 వరల్డ్ కప్ చరిత్రలోనే 50 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా రికార్డు సృష్టించింది. ఈ దశలో గాయం నుంచి కోలుకుని జట్టులోకి వచ్చిన కెప్టెన్ నాట్ సివర్–బ్రంట్ (47 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్సర్‌తో 75 పరుగులు) , మాజీ కెప్టెన్ హీథర్ నైట్ (47 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్సర్‌తో 58 పరుగులు)తో కలిసి ఇన్నింగ్స్‌ను అద్భుతంగా నిర్మించింది. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 133 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మహిళల టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్ చరిత్రలోనే ఇదే అత్యధిక భాగస్వామ్యం కావడం విశేషం.

**చేతులెత్తేసిన సౌతాఫ్రికా బ్యాటర్లు:**

170 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికాకు ఓపెనర్లు లారా వోల్వార్డ్ (17), తజ్మిన్ బ్రిట్స్ (51) మంచి ఆరంభాన్ని ఇచ్చారు. మొదటి వికెట్‌కు 43 పరుగులు జోడించిన తర్వాత వోల్వార్డ్‌ను లిన్సే స్మిత్ అవుట్ చేసి బ్రేక్ త్రూ ఇచ్చింది. ఆ తర్వాత ఇంగ్లాండ్ బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో సౌతాఫ్రికాను ఒత్తిడిలోకి నెట్టారు. చార్లీ డీన్ ప్రమాదకరమైన బ్రిట్స్, మరిజానే కాప్‌లను అవుట్ చేయగా, లారెన్ బెల్, ఫ్రేయా కెంప్, సోఫీ ఎక్లెస్టోన్ తలో వికెట్ తీసి సౌతాఫ్రికా బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీశారు. సౌతాఫ్రికా జట్టులో బ్రిట్స్ (51) మినహా మరెవ్వరూ రాణించలేకపోయారు. దీంతో దక్షిణాఫ్రికా నిర్ణీత ఓవర్లలో 130 పరుగులకే పరిమితమై, 40 రన్స్ తేడాతో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. టోర్నీలో ఇప్పటి వరకు ఓటమి ఎరుగని ఆస్ట్రేలియా వర్సెస్ ఇంగ్లాండ్ జట్లు ఇప్పుడు ట్రోఫీ కోసం ఫైనల్లో పోటీపడనున్నాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com